

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 16-02-2026 | సంపుటి - 26 | సంచిక -268 | రూ : 4 | పేజీలు: 8






## రైతులకు పూర్తి రక్షణ..

### రాహుల్ గాంధీ తప్పుదోవపట్టిస్తున్నాడు : అమిత్ షా

- యూఎస్, ఈయూ వాణిజ్య ఒప్పందాలపై కాంగ్రెస్ ఆరోపణలు
- ఖండించిన అమిత్ షా
- రైతు, పాడి, మత్స్య రంగాలకు పూర్తి రక్షణ కల్పించామని వెల్లడి
- యూపీఏ, ఎన్డీయే వ్యవసాయ బడ్జెట్లను పోల్చిన హోంమంత్రి
- విషయంపై చర్చకు రావాలంటూ రాహుల్ గాంధీకి బహిరంగ సవాల్

2లో

## నేను పాలకుడిని కాదు..

# సేవకుడిని

- అచ్చంపేటలో సంత్ సేవాలాల్ పుణ్యక్షేత్రం 20 ఎకరాల్లో నిర్మాణం
- మాకు సేవ చేయడానికే ప్రజలు అవకాశం ఇచ్చారు
- చదువుతోనే ధనవంతులు : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

2లో





## ఏప్రిల్ 1 నుంచి

# కొత్త రైల్వే జోన్..?

- 3 డివిజన్లకు పరిమితం కానున్న ద.మ.రైల్వే
- విశాఖపట్నం కేంద్రంగా ద.కోస్తా జోన్ కార్యకలాపాలు

హైదరాబాద్: దక్షిణమధ్య రైల్వే పునర్విభజన ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. కొత్త రైల్వే జోన్‌కు అపాయింటెడ్ డేను కేంద్ర ప్రభుత్వం తొందరలోనే ప్రకటించనున్నట్టు తెలిసింది. ఏప్రిల్ 1 నుంచి నూతన రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభింపజేయాలని రైల్వేశాఖ భావిస్తున్నట్లు ద.మ.రైల్వే వర్గాలకు సంకేతాలు అందినట్లు సమాచారం. ఇది అమల్లోకి వస్తే ఆరు డివిజన్లతో సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న ద.మ.రైల్వే జోన్ సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్‌లకే పరిమితం తరువాయి 2లో

## ప్రజాకర్షక పథకాలకు

# తెరదించాం

- వ్యవస్థీకృత అంతరాలు సరిచేస్తున్నాం
- తదుపరి ప్రస్థానానికి కేంద్ర బడ్జెట్ ఊతం
- వికసిత భారత్‌కు ఇది పునాది
- వాణిజ్య ఒప్పందాలతో ఎగుమతులకు ఊపు
- తెలుగు రాష్ట్రాలకూ ప్రయోజనం చేకూర్చాం
- నా ఆలోచనలన్నీ దీర్ఘకాలిక దృష్టితోనే..
- 'పీటీఐ' ప్రత్యేక ఇంటర్వ్యూలో ప్రధాని నరేంద్ర మోదీ

2లో





## నేడు రాజధానికి

# బిల్‌గేట్స్ బృందం

- సంజీవని, సాగులో సాంకేతికత సహా పలు ప్రాజెక్టుల పరిశీలన
- స్వర్ణాంధ్ర విజన్2047పై చంద్రబాబు ప్రజంటేషన్

అమరావతి: గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్‌గేట్స్ సోమవారం అమరావతిలో పర్యటించనున్నారు. ఆయనతో పాటు ఫౌండేషన్‌కు చెందిన తరువాయి 2లో





## కోవా బన్ వ్యాపారి వలీకి అండగా ఉంటాం: మంత్రి నారా లోకేశ్ భరోసా

- మేడారం జాతరలో కర్నూలు చిరు వ్యాపారికి వేధింపులు
- 'ఫుడ్ జిహాద్' ఆరోపణలతో వేధింపులకు పాల్పడిన యూట్యూబర్లు
- ఘటనపై తీవ్రంగా స్పందించిన మంత్రి నారా లోకేశ్
- బాధితుడు వలీకి క్షమాపణ చెబుతూ ట్వీట్
- త్వరలోనే వలీని కలుస్తానని, కోవా బన్ తింటానని హామీ

2లో

## కీసర లో

# శివోహం..

### కనుల పండువగా శివరాత్రి పూజలు



2లో

## రైతుకు నేస్తం...

### వినియోగదారుకు అభయహస్తం

- సేంద్రియ ఉత్పత్తులకు ప్రత్యేక యాప్
- సిద్ధం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- నకిలీల నుంచి విముక్తికి అవకాశం

హైదరాబాద్: రసాయన అవశేషాలు లేని సేంద్రియ ఉత్పత్తులపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఫలితంగా వాటి విక్రయాలు పెరుగుతున్నాయి. ఇదే అదనుగా చక్కటి లేబుల్, ఆకర్షణీయ ప్యాకింగ్‌లతో నకిలీ ఉత్పత్తులు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. పైగా ధరలు అసలు వాటికంటే అధికంగా ఉంటున్నాయి. వాటిని గుర్తించలేక వినియోగదారులు తరువాయి 2లో

# నేను పాలకుడిని కాదు.. సేవకుడిని

హైదరాబాద్ : తాము పాలకులం కాదు సేవకులమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తమకు సేవ చేయడానికే ప్రజలు అవకాశం ఇచ్చారని తెలిపారు. పాలకుడిగా తాను ఎప్పుడూ ప్రవర్తించలేదని, సేవకుడిగా మాత్రమే వ్యవహరిస్తున్నట్టు చెప్పారు. నేనే రాజు నేనే మంత్రి వ్యాఖ్యలను వక్రీకరించారని చెప్పారు. గెలుపు ఓటమి అన్నింటికీ తానే బాధ్యత తీసుకుంటానని చెప్పానన్నారు. వివిధ వర్గాలను పరిపాలనలో భాగస్వాములను చేయాలనే ఆలోచన తనదని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఎస్సీలు 17 శాతం ఉంటే తమ ప్రభుత్వంలో 30 శాతం ఉన్నారన్నారు. దళితులకు మూడు మంత్రి పదవులు, స్పీకర్ ఇచ్చామన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసి వారికి మేలు చేశామన్నారు. సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన ఈ మేరకు మాట్లాడారు. సేవాలాల్ జయంతిని అధికారికంగా చేయడం తమ ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. అచ్చంపేట అడవుల్లో 20 ఎకరాల్లో సంత్ సేవాలాల్ పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అచ్చంపేటలో 20 ఎకరాల్లో సంత్ సేవాలాల్ పుణ్యక్షేత్రం నిర్మిస్తున్నట్టు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ పుణ్యక్షేత్రాన్ని వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 15 నాటికి పూర్తి చేసి ప్రారంభిస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని బంజారా భవన్‌లో నిర్వహించిన సంత్ సేవాలాల్ 287వ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. పుణ్యక్షేత్రం నిర్మాణం కోసం క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ముఖ్యమంత్రి రోడ్లు, భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. తన ప్రజా జీవితంలో జెడ్పీటీసీగా విజయం సాధించడం మొదలు ముఖ్యమంత్రిగా తాను కొనసాగుతున్న క్రమంలో 20 ఏండ్లలో లంబాడాలు తనకు అండగా నిలిచారని ఆయన గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ఇందిరాగాంధీ హయంలో ల్యాండ్ సీలింగ్‌ను తెచ్చి భూములను పంచారనీ, అదే విధంగా ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం పంచేందుకు ప్రభుత్వం వద్ద భూములు లేవనీ, దేశాన్ని ఏలేందుకు ఏ చదువులు ఎంత చదువుకున్నా తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన సోషల్, ఎకనామిక్, క్యాస్ట్ సర్వేను ఆయన ప్రస్తావిస్తూ, గతంలో మాదిరిగా భూములుంటేనే ధనవంతులనే పరిస్థితి లేదని తెలిపారు. చదువుకుంటేనే ధనవంతులుగా మారుతున్నారని ఆ సర్వేలో గమనించినట్టు చెప్పారు. భూములు, తాత్కాలిక సంక్షేమం మరిచి బంజారాలు చదువుకోవాలని సీఎం సూచించారు. చదువే వారి భవిష్యత్తును మారుస్తుందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో, పునర్నిర్మాణంలో లంబాడాల పాత్ర తీసివేయలేనిదని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. సురేష్ నాయక్, కవితా నాయక్ తదితరుల ఆత్మ బలిదానాలు చేశారని ఆయన ఉదహరించారు. వారికి సంక్షేమంలో, అభివృద్ధిలో, ప్రభుత్వ పాలనలో సముచిత భాగస్వామ్యం, గౌరవం దక్కాల్సి ఉందన్నారు. ప్రతి తండాకు బీటీ రోడ్లను వేసేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి గిరిజన సంక్షేమశాఖ మంత్రినీ, ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రతి తండాలో పాఠశాల భవనాలు, గ్రామ పంచాయతీ భవనాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. అటవీ నిబంధనలు అడ్డుగా ఉన్న తండాల్లో విద్యుత్ సరఫరాకు సోలార్ ద్వారా అందించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఇప్పటికే అచ్చంపేటలో ప్రయోగాత్మకంగా 40 వేల పంప్ సెట్లకు సోలార్ విద్యుత్ ఇచ్చేందుకు ఎంపిక చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. గత ప్రభుత్వం 10 ఏండ్లు రేషన్ కార్డులు ఇవ్వలేదని ఆయన విమర్శించారు. తమ ప్రభుత్వం రేషన్ కార్డులతో పాటు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామనీ, దీంతో మార్కెట్‌లో గతంలో రూ.60 కేజీ ఉన్న సన్నబియ్యం ధర రూ.40కి పడిపోయిందని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం రూ.9 వేల కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. ఇండ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా, స్వయం సహాయక సంఘాలను వెయ్యి బస్సులకు యజమానులను చేశామనీ, వెయ్యి మెగావాట్ల సోలర్ ప్రాజెక్టును అప్పగించామనీ, హైటెక్ సిటీలో విలువైన భూమిని మహిళా సంఘాల ఉత్పత్తుల కోసం కేటాయించామనీ, హాస్టల్ బాలికలకు కాస్మొటిక్స్ ఛార్జెస్‌ను 200 శాతం పెంచినట్టు తెలిపారు. గ్రూప్స్‌తో పాటు ప్రభుత్వం చేపట్టిన 70 వేల నియామకాల్లో 85 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఉద్యోగాలు సాధించారని తెలిపారు.

## నేడు రాజధానికి బిల్‌గేట్స్ బృందం

అమరావతి: గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్‌గేట్స్ సోమవారం అమరావతిలో పర్యటించనున్నారు. ఆయనతో పాటు ఫౌండేషన్‌కు చెందిన ఆరుగురు ప్రతినిధుల బృందం సచివాలయానికి రానుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లతో వారు సమావేశమవుతారు. సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రాన్ని బిల్‌గేట్స్ సందర్శిస్తారు. ఆర్టీజీఎస్ విధానాలు, సాధిస్తున్న ఫలితాల్ని గేట్స్‌కు చంద్రబాబు వివరిస్తారు. అనంతరం బిల్‌గేట్స్ బృందంతో సీఎం, మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులు సమావేశమవుతారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ ప్రాజెక్టులను మరింత విస్తరించే అంశంపై చర్చిస్తారు. స్వర్ణాంధ్ర విజన్2047 లక్ష్యాలు, ప్రజారోగ్యం, వ్యవసాయం, విద్య తదితర రంగాల్లో చేపట్టిన సంస్కరణలపై చంద్రబాబు ప్రజంటేషన్ ఇస్తారు. మెడ్‌టెక్, డయాగ్నొస్టిక్స్ సేవలు, సాగులో సాంకేతికత వినియోగం సహా తదితర ప్రాజెక్టుల గురించి వివరిస్తారు. ప్రత్యేకించి గేట్స్ ఫౌండేషన్ సహకారంతో నడుస్తున్న సంజీవని ప్రాజెక్టు గురించి తెలియజేస్తారు. అనంతరం ఉండవల్లిలోని వ్యవసాయ క్షేత్రాన్ని చంద్రబాబుతో కలిసి గేట్స్ బృందం సందర్శించనుంది. డ్రోన్లు, ఏఐ టెక్నాలజీ సహకారంతో చేపడుతున్న సాగు విధానాన్ని వీరు పరిశీలిస్తారు.

## ఏప్రిల్ 1 నుంచి కొత్త రైల్వే జోన్?

హైదరాబాద్: దక్షిణమధ్య రైల్వే పునర్విభజన ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. కొత్త రైల్వే జోన్‌కు అపాయింటెడ్ డేను కేంద్ర ప్రభుత్వం తొందరలోనే ప్రకటించనున్నట్టు తెలిసింది. ఏప్రిల్ 1 నుంచి నూతన రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభింపజేయాలని రైల్వేశాఖ భావిస్తున్నట్లు ద.మ.రైల్వే వర్గాలకు సంకేతాలు అందినట్లు సమాచారం. ఇది అమల్లోకి వస్తే ఆరు డివిజన్లతో సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న ద.మ.రైల్వే జోన్ సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్‌లకే పరిమితం అవుతుంది. మిగతా విజయవాడ, గుంటూరు, గుంతకల్లుతో పాటు తూర్పు కోస్తా జోన్‌లోని కొంతభాగంతో కలిపి కొత్తగా ఏర్పడే విశాఖపట్నం డివిజన్‌తో కలిపి దక్షిణ కోస్తా జోన్ ఏర్పాటవుతుంది.

**ఉన్న సమయం తక్కువే..**

కొత్త జోన్‌కు ఏప్రిల్ 1 అపాయింటెడ్ డే అంటే.. ఇంకా ఆరు వారాలే ఉంది. కొత్త జోన్ ప్రారంభానికి ఇంత తక్కువ సమయం సాంకేతికంగా సరిపోతుందా అన్న కోణంలోనూ రైల్వేబోర్డులో చర్చ జరిగినట్లు తెలిసింది. సాధ్యాసాధ్యాలపై కొద్దిరోజుల్లోనే స్పష్టత వస్తుందని.. నెలాఖరుకల్లా కొత్త జోన్ అపాయింటెడ్ డేపై నోటిఫికేషన్ రావచ్చంటూ ద.మ.రైల్వే ప్రధాన కార్యాలయం అధికారులు అంటున్నారు. డివిజన్ల వారీగా విభజన, సరిహద్దుల్లో మార్పులు చేర్పులు, ఆదాయ వ్యయాలు, రైళ్ల నిర్వహణ సహా పలు అంశాలతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రైల్వేబోర్డుకు తొమ్మిది నెలల క్రితమే చేరింది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో విశాఖపట్నం కేంద్రంగా కొత్తగా రైల్వే జోన్ ఏర్పాటు చేయనున్నట్లు అప్పటి ప్రభుత్వం హామీ ఇచ్చింది. నూతన జోన్‌కు కేంద్ర మంత్రివర్గం 2025 ఫిబ్రవరిలో ఆమోదం తెలిపింది. కొన్ని నెలల నుంచే కొత్త జోన్ జీఎం, విభాగాధిపతులను బోర్డు దశలవారీగా నియమిస్తోంది.

**మార్పులు చేర్పులు ఇవే..**

గుంతకల్లు డివిజన్‌లో ఉన్న రాయచూరువాడి 108 కి.మీ.ల సెక్షన్ సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌కు పరిమితం కానుంది. విష్ణుపురంపగిడిపల్లి, విష్ణుపురంజాన్‌పహాడ్ 142 కి.మీ.ల మార్గాలు ప్రస్తుతం గుంటూరు డివిజన్‌లో ఉండగా.. అవి సికింద్రాబాద్‌కు బదిలీ అవుతాయి. 46 కి.మీ.ల మోటుమర్రికొండపల్లి మార్గం సికింద్రాబాద్ నుంచి విజయవాడ డివిజన్ పరిధిలోకి వెళతాయి.

## రైతుకు నేస్తం... వినియోగదారుకు అభయహస్తం

హైదరాబాద్: రసాయన అవశేషాలు లేని సేంద్రియ ఉత్పత్తులపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఫలితంగా వాటి విక్రయాలు పెరుగుతున్నాయి. ఇదే అదనుగా చక్కటి లేబుల్, ఆకర్షణీయ ప్యాకింగ్‌లతో నకిలీ ఉత్పత్తులు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. పైగా ధరలు అసలు వాటికంటే అధికంగా ఉంటున్నాయి. వాటిని గుర్తించలేక వినియోగదారులు గందరగోళానికి గురవుతున్నారు. తమ పంటలు అమ్ముడవక సేంద్రియ రైతులూ నష్టపోతున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను సిద్ధం చేస్తోంది. ఇవీ వివరాలు... తెలంగాణలో ప్రస్తుతం 10 వేల మంది రైతులు... 50 వేల ఎకరాల్లో సేంద్రియ సాగు చేస్తున్నారు. ఇందులో 30 వేల ఎకరాల్లో వరి, పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు వేస్తుండగా... 20 వేల ఎకరాల్లో పండ్ల తోటలున్నాయి. ఎరువులు, రసాయనాలు, పురుగు మందులు లేకుండా జీవ పదార్థాలతోనే పంటలను, తోటలను సాగు చేస్తున్నారు. వీటి ఉత్పత్తులకు మార్కెటింగ్ సమస్యగా మారింది. రైతుబజార్లలోనూ విడిగా కౌంటర్లు లేవు. దాంతో ఉద్యాన ప్రదర్శనలు, దుకాణాలు, షాపింగ్ మాల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. ఎగుమతులూ పరిమితంగానే ఉంటున్నాయి. మరోవైపు సాధారణ ఉత్పత్తులనే సేంద్రియమైనవిగా పేర్కొంటూ మార్కెట్‌లో అమ్మకాలు భారీఎత్తున సాగుతున్నాయి. వినియోగదారుల బలహీనతను ఆసరాగా తీసుకొని వివిధ సంస్థల పేరిట భారీ ధరలకు అంటగడుతున్నారు. దాంతో అసలు కంటే నకిలీల అమ్మకాలే ఎక్కువ ఉండటం గమనార్హం.

**విక్రయాలకు 200 సంస్థలకు అనుమతి**

సేంద్రియ విత్తనాలు, ఉత్పత్తులను ధ్రువీకరణ చేసేందుకు... 2015లో తెలంగాణ రాష్ట్ర విత్తన, సేంద్రియ ధ్రువీకరణ ప్రాధికార సంస్థ (టీఎస్ఎస్‌వోసీఏ) ఏర్పాటైంది. ఇందులో సేంద్రియ ఉత్పత్తుల సంస్థలు విధిగా నమోదు చేసుకొని, లైసెన్స్ పొందిన తర్వాత వాటిని లేబుళ్లతో విక్రయించాలి. రాష్ట్రంలో ఇప్పటివరకు 200 సంస్థలే లైసెన్సు పొందాయి. రైతులు సైతం తమ ఉత్పత్తుల ధ్రువీకరణ చేసుకోవాలి. చాలామందికి అవగాహన లేకపోవడంతో దరఖాస్తు చేసుకోకపోవడంతో వాటి ధ్రువీకరణ జరగలేదు. ఇటీవల కొందరు రైతులు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి నకిలీ ఉత్పత్తుల కారణంగా తాము నష్టపోతున్నట్లు వివరించారు.

## ప్రజాకర్షక పథకాలకు తెరదించాం

ఢిల్లీ: ఉత్పాదకతను పెంచేలా ఖర్చులు ఉండాలనేదే తమ సర్కారు నిర్ణయించుకున్న గీటురాయి అని, అందుకే బడ్జెట్లో ప్రజాకర్షక పథకాల జోలికి వెళ్లలేదని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఉద్యోగావకాశాలకు, సుస్థిరాభివృద్ధికి ఊతమిచ్చేలా మౌలిక సదుపాయాలకు రికార్డుస్థాయిలో కేటాయింపులు చేశామని చెప్పారు. ఆదివారం పీటీఐ వార్తాసంస్థకు ఆయన ఈ మేరకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. విదేశాలతో కుదుర్చుకుంటున్న వాణిజ్య, రక్షణ ఒప్పందాలు, సంస్కరణలవల్ల ప్రజలకు ఒనగూరుతున్న ప్రయోజనాలు, ప్రపంచవ్యాప్త అస్థిర పరిస్థితుల్లోనూ భారత్ వెలుగుతున్న తీరు.. తదితర అంశాలపై మోదీ సవివరంగా రాతపూర్వక సమాధానాలు ఇచ్చారు. ''స్వల్పకాలిక ప్రజాకర్షక పథకాలను మేం ఉద్దేశపూర్వకంగానే పక్కనపెట్టాం. మునుపటి ప్రభుత్వాల హయాంలో నెలకొన్న వ్యవస్థీకృత అంతరాలను సరిచేయడంపై దృష్టి సారించాం. సాహసోపేత సంస్కరణలు చేపట్టాం. అభివృద్ధి చెందిన భారత్‌కు పునాదులు వేశాం. ఆ ప్రస్థానంలో తదుపరి స్థాయికి చేరేందుకు కొత్త బడ్జెట్ దోహదపడుతుంది. మా ప్రాధాన్యాలు, పాలనకు చక్కని ప్రతిబింబంలా బడ్జెట్ నిలుస్తోంది. సంస్కరణల ఎక్స్‌ప్రెస్ పయనాన్ని ఇది వేగవంతం చేస్తుంది. మారిపోతున్న ప్రపంచంలో అవకాశాలను మన యువత అందిపుచ్చుకునేలా దీనిని రూపొందించాం. 'ఇప్పుడు కాకుంటే, ఎప్పుడూ కాదు' అనే బలవంతపు భావన నుంచి ఈ బడ్జెట్ రాలేదు. వికసిత దేశంగా ఎదగాలనే భారత్ ఆరాటానికి ప్రతీకగా ఇది రూపొందింది. 'మేం సిద్ధం' అనే భావన నుంచి ఇది వచ్చింది. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా దేశ రక్షణ రంగాన్ని ఆధునికీకరించాల్సి ఉండటంతో దానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాం'' అని మోదీ వివరించారు.

*** విదేశీ పెట్టుబడిదారుల్లో పెరిగిన విశ్వాసం**

''భారత్‌లో ఇప్పుడు రాజకీయ సుస్థిరత ఉంది. అందుకే విదేశీ పెట్టుబడిదారులకు భారత మార్కెట్‌పై విశ్వాసం పెరుగుతోంది. చాలా దేశాలు మనతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. భారత్‌లో తయారీ రంగం, సేవారంగం, ఎంఎస్ఎంఈ పరిశ్రమలు బలంగా ఉన్నందువల్లే ఇతర దేశాలతో సాధికారతతో వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరిపే స్థాయికి చేరాం. 38 దేశాలతో ఇప్పటికే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నాం. పెరుగుతున్న పెట్టుబడులు, డిజిటల్ మౌలిక సదుపాయాలు వంటివాటివల్ల వృద్ధి 7 శాతంగా ఉంటుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. ఇలాంటి వ్యయం వల్ల దీర్ఘకాలికంగా ఆర్థిక వృద్ధికి ఎంతో ఊతం లభిస్తుంది. అందుకే ఈసారి వీటికి రూ.12.2 లక్షల కోట్లు కేటాయించాం. రైళ్లు, రహదారులు, విద్యుత్తు వంటి రంగాలపై ఎక్కువ ఖర్చు చేయనున్నాం. తాత్కాలిక ప్రజాకర్షణల ద్వారా కాకుండా ప్రజల జీవన నాణ్యతను పెంచి దేశాభివృద్ధిని వేగవంతం చేయాలనే మా సంకల్పాలను ఇవి చాటుతున్నాయి. భవిష్య తరాలను మదిలో పెట్టుకుని విప్లవాత్మక మార్పుల్ని తీసుకువస్తున్నాం. వేలల్లో విమానాలకు ఆర్డర్లు ఇచ్చాం. విమానాశ్రయాల్ని రెట్టింపు చేశాం. సరకు రవాణా నడవాలు, ఓడరేవులు, తీరప్రాంతాల అనుసంధానానికి పెద్దపీట వేశాం.

## కోవా బన్ వ్యాపారి వలీకి అండగా ఉంటాం

అమరావతి: తెలంగాణలోని మేడారం జాతరలో కర్నూలుకు చెందిన ఓ చిరు వ్యాపారి వేధింపులకు గురికావడం పట్ల ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. ఈ ఘటన పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, బాధితుడైన వలికి బహిరంగంగా క్షమాపణ చెప్పారు. వివరాల్లోకి వెళితే, కర్నూలు జిల్లాకు చెందిన వలీ అనే చిరు వ్యాపారి మేడారం జాతరలో కోవా బన్ అమ్ముకుంటున్నాడు. ఈ క్రమంలో కొందరు యూట్యూబర్లు అతడిని అడ్డుకుని, 'ఫుడ్ జిహాద్' చేస్తున్నావంటూ ఆరోపణలు చేశారు. అంతేకాకుండా, అతడితో బలవంతంగా కోవా బన్ తినిపించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వీడియోపై స్పందించిన నారా లోకేశ్, తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా ఒక పోస్ట్ చేశారు. "ప్రియమైన సోదరుడు వలీ గారూ, మీకు ఈ బాధ కలిగినందుకు చాలా విచారంగా ఉంది. ఇలాంటి విభజనకరమైన, మతతత్వ ప్రవర్తనకు మన తెలుగు సమాజంలో చోటు లేదు. మన సమాజం ఎల్లప్పుడూ సామరస్యం, పరస్పర గౌరవం, సోదరభావంతో నిలిచింది" అని లోకేశ్ పేర్కొన్నారు.

## రైతులకు పూర్తి రక్షణ... రాహుల్ గాంధీ తప్పుదోవపట్టిస్తున్నాడు: అమిత్ షా

ఢిల్లీ: అమెరికా, యూరోపియన్ యూనియన్‌లతో భారత్ ఇటీవల కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాల వల్ల దేశంలోని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రంగా ఖండించారు. రైతుల విషయంలో కాంగ్రెస్, ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ అబద్ధాలు ప్రచారం చేస్తూ దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రతి ఒప్పందంలోనూ వ్యవసాయం, పాడి, మత్స్య రంగాల ప్రయోజనాలకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పించిందని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం గాంధీనగర్‌లో దేశంలోనే తొలి సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ ఆధారిత ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై అమిత్ షా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంటులో నిలబడి రాహుల్ గాంధీ రైతుల ప్రయోజనాలను కాపాడతామని మాట్లాడటం నవ్వొస్తోందని ఎద్దేవా చేశారు. దేశ ప్రజలను తప్పుదోవ పట్టించడంలో కాంగ్రెస్‌కు సుదీర్ఘ చరిత్ర ఉందని, ఇప్పుడు వాణిజ్య ఒప్పందాల గురించి అబద్ధాలు ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో జరిగిన ప్రతి చర్చలోనూ రైతులు, పశుపోషకులు, మత్స్యకారుల ప్రయోజనాలకు ఎలాంటి హాని కలగకుండా సంపూర్ణ భద్రత కల్పించారని హామీ ఇచ్చారు. గత యూపీఏ ప్రభుత్వంతో పోలుస్తూ తమ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి చేసిన మేలును అమిత్ షా వివరించారు.

# కీసర లో శివోహం

(ప్రజస్ఫూర్తి, మేడ్చల్ జిల్లా) : మహాశివరాత్రి వేడుకలు మేడ్చల్ జిల్లా కీసర గుట్ట కొండపై వెలిసిన రామలింగేశ్వర స్వామి సన్నిధి లో కనుల పండువగా జరిగాయి. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. జిల్లా యంత్రాంగం పెద్ద ఎత్తున మోహరించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేశారు.

**పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి**

కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయానికి రాష్ట్ర ఐటి మినిస్టర్ జిల్లా ఇన్చార్జి మినిస్టర్ దుద్దిల్ల శ్రీధర్ బాబు రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టు వస్త్రాలు తలంబ్రాలు సమర్పించారు ఆలయ అర్చకులు మంత్రి కి ఘనంగా స్వాగతం పలికారు. మంత్రివర్యులు సతీ సమేతంగా స్వామివారి కల్యాణం లో పాల్గొన్నారు.

**దర్శించుకున్న ప్రముఖులు**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామిని ఆర్ అండ్ బి సినిమాటోగ్రఫీ రాష్ట్ర మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకట్రెడ్డి, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ లు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ అర్చకులు వీరికి ఘనంగా స్వాగతం పలికారు. పలువురు సీనియర్ జడ్జిలు కీసరకు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల కోలాహలం తో శివనామ స్మరణతో కీసర మారు మోగిపోయింది. అనంతరం భక్తులు ఆలయ పరిసర ప్రాంతాలలో ఉన్న శివలింగాలకు భక్తితో స్వయంగా అభిషేకాలు చేశారు.








# సేవాలాల్ మహారాజ్ జీవిత సందేశాలు సమాజానికి మార్గదర్శకం

* జగద్గిరిగుట్ట డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : సేవాలాల్ మహారాజ్ జీవిత సందేశాలు సమాజానికి మార్గదర్శకంగా ఉంటాయని జగద్గిరిగుట్ట డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి సందర్భంగా ఆదివారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలో జరిగిన జయంతి ఉత్సవాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ ఆయన బోధనలు ఆదివాసీ, గిరిజన సమాజ అభ్యున్నతికి తోడ్పడటమే కాకుండా, సమానత్వానికి ప్రాధాన్యతనిచ్చాయని అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ నాయక్. నర్సింగ్ నాయక్. తారా సింగ్. సునీత భాయ్. వెంకటేష్. మనోజ్ సింగ్. బాబు నాయక్ సంఘం సభ్యులు. తదితరులు పాల్గొన్నారు.

# జనావాసాల మధ్య అక్రమ గోదాంలు

* **ప్రమాదాలకు బాటవేస్తున్న నిర్లక్ష్యం**
* **కూకట్‌పల్లి సర్కిల్‌లో యథేచ్ఛగా నిర్మాణాలు**
* **అధికారులపై తీవ్ర ఆరోపణలు**

(ప్రజాస్ఫూర్తి, కూకట్ పల్లి) : సైబరాబాద్ మునిసిపల్ పరిధిలోని జనావాసాల మధ్య ఏర్పాటు చేస్తున్న అక్రమ షెడ్లు, గోదాం లు ఆందోళనకరంగా మారుతున్నాయి. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో అనుమతులు లేకుండానే భారీ నిర్మాణాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. నియంత్రణలో ఉండాల్సిన టౌన్ ప్లానింగ్ వ్యవస్థ పూర్తిగా విఫలమైందా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.నివాస భవనాల నిర్మాణానికి జీ ప్లస్ టూ లేదా జీ ప్లస్ ఫైవ్ వరకు మాత్రమే అనుమతులు జారీ అవుతాయి. కానీ అదే నివాస ప్రాంతాల్లో భారీ షెడ్లు, గోదాంల నిర్మాణాలకు ప్రత్యేక అనుమతులు, కఠిన నిబంధనలు తప్పనిసరి. అయినప్పటికీ అనుమతులేమీ లేకుండానే నిర్మాణాలు సాగుతుండటం స్థానికుల్లో ఆగ్రహం నెలకొంటుంది.

* **గోపాల్ రావు నగర్‌లో గుట్టుచప్పుడు కాకుండా పనులు?**



కెపిహెచ్బి డివిజన్ పరిధిలోని గోపాల్ రావు నగర్‌లో నివాస ఇళ్ల మధ్యనే భారీ షెడ్లు, గోదాంల నిర్మాణాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు, ప్లాన్ ఆమోదాలపై స్పష్టత లేకపోయినా పనులు వేగంగా కొనసాగుతున్నాయని వారు చెబుతున్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదులు చేసినప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

"అధికారుల మౌనం వెనుక కారణాలేమిటి?" అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

* **అగ్ని ప్రమాదాల ముప్పు – బాధ్యత ఎవరిది?**

జనావాసాల మధ్య గోదాంలు, షెడ్ల వినియోగం అగ్ని ప్రమాదాలకు దారితీసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అగ్నిమాపక శాఖ అనుమతులు, అత్యవసర మార్గాలు, రహదారి వెడల్పు, పార్కింగ్ సదుపాయాలు వంటి కీలక భద్రతా ప్రమాణాలు లేకుండా నిర్మాణాలు సాగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. అనుమతులతో నిర్మించిన భవనాల్లోనే ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో, అక్రమ నిర్మాణాల్లో భద్రతా పరిస్థితి ఎలా ఉంటుందన్న ప్రశ్న తీవ్రంగా మారుతోంది. భవిష్యత్తులో ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారు? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

* **అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు**

అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫిర్యాదులు, స్థానికుల ఆందోళనలు ఉన్నప్పటికీ ఎటువంటి గట్టి చర్యలు కనిపించకపోవడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది.

* **తక్షణ దర్యాప్తు, చర్యలు కోరుతూ స్థానికులు**

జనావాసాల మధ్య కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలపై తక్షణ దర్యాప్తు జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిర్మాణాలను వెంటనే నిలిపివేసి భద్రతా ప్రమాణాలు అమలు చేయాలని కోరుతున్నారు.

# ఘనంగా మహాశివరాత్రి వేడుకలు



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా చింతల్ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ లో గల శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో భగత్ సింగ్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షులు పచ్చిమట్ల నరేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రతాపరెడ్డి లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయం, సత్యనారాయణ స్వామి దేవాలయం, అయ్యప్ప స్వామి వారి ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్లు కుడికాల సాధేవ్ , పెండ్లి వెంకట్ రెడ్డి, శ్రీధర్ గౌడ్, తన్నీరు సాయి బాబా, సామల పుండరీకం, సిహెచ్ ఈశ్వర్, గువ్వల రాము, ముప్పిడి నరసింహ, ఆర్ మల్లేష్, కృష్ణారెడ్డి, వెంకటేష్, శివ, కిషన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నిజాంపేటలో ఘనంగా మహా శివరాత్రి వేడుకలు






కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు శివాలయాలలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప శ్రీశ్రీశ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయం, శ్రీశ్రీ నల్ల పోచమ్మ దేవాలయం , మధుర నగర్ సాయిబాబా ఆలయాలలో ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ఆ పరమేశ్వరుడికి భక్తిశ్రద్ధలతో పంచామృతాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# శివాలయాల్లో మహాశివరాత్రి సందడి





ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయాలు తెల్లవారుజాము నుంచే భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు ఘనంగా నిర్వహించారు. శివాలయాల వద్ద భక్తులు బారులు తీరుతూ భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు.ఉదయం నుంచే భక్తులు పాలు, పన్నీరు, తేనె, బెల్లంతో అభిషేకాలు నిర్వహించి పరమేశ్వరునికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలయ ప్రాంగణాలు ఓం నమశ్శివాయ నినాదాలతో మార్మోగాయి. మహిళలు, యువతులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో ఆలయాలను దర్శించుకున్నారు.మహా శివరాత్రి సందర్భంగా కొత్తగూడెం పరిసర ప్రాంతాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



# శ్రీశ్రీశ్రీ వీరంజనేయ శివాలయంలో భక్తి శ్రద్ధలతో మహా శివరాత్రి వేడుకలు

కూకట్ పల్లి, ప్రజాస్ఫూర్తి : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా కూకట్ పల్లి జోన్ పాపిరెడ్డి నగర్ లోగల శ్రీశ్రీశ్రీ వీరంజనేయ శివాలయంలో ఆదివారం మహా శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ ఇతర నేతలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటి సభ్యులు ఎమ్మెల్యే తో పాటుగా ఇతర నేతలను శాలువతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు నార్నే శ్రీనివాస్ రావు, శ్రీకాంత్, సీనియర్ నేతలు నాయినేని చంద్రకాంత్ రావు, సంజీవ్ రెడ్డి బస్తి అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి, ఆలయ చైర్మన్ ధర్మరావు, అధ్యక్షుడు ఆడెపు ప్రభాకర్, బస్తి ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి, కోశాధికారి నర్సింహులు నేతలు రాపోలు తిరుపతిరెడ్డి, పి.శంకర్ రెడ్డి , తాటి కిరణ్, వనం. ఆంజనేయులు, ముత్యం వెంకటరెడ్డి, పాండుగౌడ్ , జనపల్లి వెంకటరెడ్డి, నల్లసాని.బాల్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, జాలపు.శంకర్ రెడ్డి, నరసింహులు పద్మశాలి, ప్లంబర్ యాదగిరి, వెంకటేశ్వర రెడ్డి, మహేందర్ రెడ్డి , గోపాల్, రామ నర్సింహారెడ్డి, సత్యనారాయణ , దశరథ, వెంకటేష్, ఉదయ్ కుమార్, మహేష్ , రఘు, నర్సింలు, వినయ్, నరసింహ , లక్ష్మణ్ మేస్త్రి ,లక్ష్మమ్మ, శోభ , పద్మ, కర్ణ, పద్మ, బస్తి వాసులు ,కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా మల్లికార్జున స్వామి భ్రమరాంబ కేతమ్మల కళ్యాణ మహోత్సవం

జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా జగద్గిరిగుట్ట కొండపై వెలసిన మల్లికార్జున స్వామి భ్రమరాంబ కేతమ్మ గార్ల 40వ కళ్యాణ మహోత్సవం చైర్మన్ జెకె శేఖర్ యాదవ్ , యాదవ సంఘం ఆధ్వర్యంలో అంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎంపీ ఈటల రాజేందర్ , కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఇన్చార్జి కొలను హనుమంతు రెడ్డి , యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మేకల రాముల యాదవ్, మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ లు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు గండిరాజు యాదవ్, జగదీష్ యాదవ్, సమ్మయ్య యాదవ్, కుమార్ యాదవ్, సింహ



యాదవ్, నాగరాజు కురుమయ్య, సాయి, ఆంజనేయులు, పండరి కృష్ణ, శ్రీనివాస్ యాదవ్, శ్రీకాంత్ , యాదవ నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# కన్ సాన్ పల్లి లో వైభవంగా శివపార్వతుల కల్యాణం

* **పెద్ద సంఖ్యలో కళ్యాణ వేడుకల్లో పాల్గొన్న భక్తులు...**

అందోలు, ప్రజాస్ఫూర్తి: అందోలు మండల పరిధిలోని కన్ సాన్ పల్లి గ్రామంలో ప్రసిద్ధి గాంచిన ఈశ్వరాలయం వద్ద ఆదివారం రాత్రి శివపార్వతుల కళ్యాణం కన్నుల పండుగగా జరిగింది. వార్డు సభ్యులు నోమన్నగారి మాధవరెడ్డి, ఇంద్రజ దంపతుల చేతుల మీదుగా పురోహితులు ఆనంద్ శర్మ వేద మంత్రోచ్చరణల మధ్య రెండు గంటలపాటు కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగింది. 'హర హర మహాదేవ శంభో శంకర్'.. 'ఓం నమఃశివాయ' అంటూ భక్తుల శివనామస్మరణతో ఈశ్వరాలయ ప్రాంగణం మార్మోగింది. శివపార్వతులను పట్టువస్త్రాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో కల్యాణ వేదికను ఏర్పాటు చేశారు. శివపార్వతుల వివాహ వేడుకలు



చూస్తున్నంత సేపు భక్తులు తన్మత్వయంతో పులకరించారు. ఈ సందర్భంగా భక్తులు శివ పార్వతులను దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకి సేవలో ఉంచి గ్రామంలో పురవీధుల గుండా డప్పు చప్పుల మధ్య ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శేరి మాణిక్ రెడ్డి, మాజీ ఎంపిటిసి బాలయ్య, మాజీ ఉప సర్పంచ్ మొరబోయిన కృష్ణ, మాజీ వార్డు సభ్యులు గజేందర్ రెడ్డి, ధీరజ్ రెడ్డి, సురేష్ రావు, వెంకట్ రెడ్డి,జై రాములు, ఈశ్వరయ్య, కాల్వమీది రాములు,శంకర్ రెడ్డి, భజరంగ్ సభ్యులు దేవునూరి శ్రీశైలం,మొరబోయిన మహేష్, చాకలి జగన్, నాగేష్, నక్క కృష్ణ, చెంద్రయ్య తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# భవానీ పిల్లల ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంప్

ప్రజాస్ఫూర్తి, జన్నారం : మహా శివరాత్రి సందర్భంగా కలమడుగు గోదావరి వద్ద జన్నారం మండల కేంద్రానికి చెందిన భవానీ పిల్లల ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం రోజున ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించారు.గోదావరి స్నానాలకు వచ్చిన పిల్లలకు పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కశ్యప్ శ్రీవాత్సవ్ ఉచితంగా వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు



పంపిణీ చేశారు. పిల్లల కోసం ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించిన భవాని పిల్లల ఆసుపత్రి యజమాన్యాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొంతల నాగమణి మల్లేష్, రవీందర్,హరీష్‌రెడ్డి, నగేష్, శ్రీనివాస్, కాంద్రపు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు నాగునూరి మహేష్ జన్మదిన వేడుకలు



ప్రజాస్ఫూర్తి , కాప్రా :కాప్రా డివిజన్‌కు చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నాగునూరి మహేష్ పుట్టినరోజు సందర్భంగా ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా మహేష్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల సంక్షేమం కోసం ఎమ్మెల్యే చేస్తున్న సేవలను అభినందిస్తూ, వారి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బైరి నవీన్ గౌడ్, రేగళ్ల సతీష్ రెడ్డి, పెంటారెడ్డి, కొప్పుల కుమార్, మచ్చ కొండలు గౌడ్, ఎన్ కుమార్, సోలార్ నరసింహ, ఎన్ వికాస్, రాజు, సాయి, నాగేందర్, శ్రీకాంత్, నవీన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో ఘనంగా మహా శివరాత్రి వేడుకలు



ప్రజాస్ఫూర్తి ,శంకర్‌పల్లి : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శంకర్ పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11వ శతాబ్దానికి చెందిన మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువ జామున ఉదయం ఒంటిగంట నుంచే స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది.రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్ తో పాటు వివిధ ప్రాంతాల నుంచి సుమారు లక్ష మందికి పైగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారని ఆలయ వర్గాలు తెలిపారు. చేవెళ్ల కోర్టు జడ్జి దంపతులు, దేశముఖ్ అనూష అవనందరెడ్డి, తహసిల్దారు సురేందర్ దంపతులు, సిఐలు శ్రీనివాస్ గౌడ్, సతీష్, క్రాంతి కుమార్ దంపతులు, రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీ జ్యోతి, భీమ్ భరత్, యాంకర్, వైయస్సార్ సిపి అధికార ప్రతినిధి శ్యామల, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తనయుడు విక్రం రెడ్డి స్వామి వారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు ఈ కార్యక్రమంలో , ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# శ్రీ వెంకట శివరామలయంలో మహ శివరాత్రి వేడుకలు



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 17వ డివిజన్లోని శ్రీ వెంకట శివరామలయంలో మహ శివరాత్రి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవతలను ఆలయ ధర్మకర్త, 17వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ కుటుంబ సామెతంగా దర్శించుకుని స్వామి వారికీ పంచామృతాల అభిషేకం చేశారు.

# ఘనంగా సేవాలాల్ జయంతి



ప్రజాస్ఫూర్తి, జన్నారం: మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని బంగారు తండా గ్రామంలో బంజారాల ఆరాధ్య దైవమైన సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జయంతి సందర్భంగా గ్రామస్తులు సేవాలాల్ మహారాజ్ కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భుక్యా నిర్మల రవీందర్, ఉప సర్పంచ్ జగదీష్ నాయక్,కారోబార్ అజ్మీర గోవింద్ నాయక్, ఆలయ కమిటీ చైర్మన్ బోడరాజు, తదితర గ్రామస్టులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపికైన జన్నారం విద్యార్థిని




ప్రజాస్ఫూర్తి, జన్నారం : మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని ప్రభుత్వ కళాశాల లో చదువుతున్న సీఈసీ గ్రూపుకు చెందిన విద్యార్థిని ఎండి అస్మా రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ పి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం రోజున మంచిర్యాల జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మందమర్రి లో నిర్వహించిన సీఎం కప్ కరాటే పోటీలలో అండర్ 16 విభాగంలో పాల్గొన్న జన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన మొదటి సంవత్సరం విద్యార్థిని ఎండి ఆస్మా ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలలో ఆడనుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థినిని స్పోర్ట్స్ ఉపాధ్యాయుడు కుమారస్వామి తో పాటు అధ్యాపకులు బాబురావు, సాయికుమార్, రవీందర్, నాగేశ్వరరావు, మోహన్, దేవేందర్, కరుణాకర్, శివరాం, శశికళ, స్వరూప లు అభినందించారు.

# మంత్రి పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్‌లోకి ఐదుగురు స్వతంత్ర కార్పొరేటర్లు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులుగా విజయం సాధించిన ఐదుగురు కార్పొరేటర్లు ఆదివారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఖమ్మంలోని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఈ చేరికల కార్యక్రమం జరిగింది. మంత్రి పొంగులేటి సమక్షంలో వీరంతా కాంగ్రెస్ పార్టీలో చేరగా, వారికి మంత్రి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.పార్టీలో చేరిన వారిలో 1వ డివిజన్ కార్పొరేటర్ సీరపు సుగుణ, 13వ డివిజన్ కార్పొరేటర్ తలుగు శాంతా, 34వ డివిజన్ కార్పొరేటర్ బట్టు విజయలక్ష్మి, 42వ డివిజన్ కార్పొరేటర్ దున్నపోతుల మణి, 48వ డివిజన్ కార్పొరేటర్ ధర్మసోత్ నరేష్ ఉన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు, ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై తాము కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కొత్తగూడెం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# దేవులపల్లి రమేశ్ కు రవీంద్ర భారతిలో సన్మానం



(సిద్దిపేట, ప్రజాస్ఫూర్తి) : హైదరాబాద్ రవీంద్రభారతిలో విమల సాహితీ సమితి,తెలంగాణ సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ కవి సిద్దిపేట కు చెందిన దేవులపల్లి రమేశ్ ను సన్మానిచ్చారు. డా.జెల్ది విద్యాధర్, సిరికొండ నరసింహారావు, రచించిన యుద్ధం శాంతి పుస్తక ఆవిష్కరణలో నంగునూర్ మండలనికి చెందిన రచయిత, కవి దేవులపల్లి రమేశ్, దేశామా నీకు ఇదే వందనం అనే కవిత గానం చేశారు. ఇందుకు ముఖ్యఅతిథి పద్మ శ్రీ కులకలూరి ఇనాక్, ఎం ఎల్ సి డాక్టర్ గోరేటి వెంకన్న, డా. బిక్కికృష్ణ,డా. రాధా కుసుమ, చేతుల మీదుగా దేవులపల్లి రమేశ్, ఘనంగా సత్కరించారు. అనంతరం కవి రమేశ్ మాట్లాడుతూ తెలుగు సాహిత్య చరిత్ర, తెలుగు భాష గొప్ప తనం మన తెలుగు భాషను కాపాడుకోవాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో డా.నాళేశ్వర శంకరం, శిఖామణి, కవులు,రచయితలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రూపురేఖలు మార్చిన నాయకుడు కేసీఆర్.. 17న ఊరూరా పండుగలా జన్మదిన వేడుకలు: తలసాని




సైబరాబాద్ : తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలను ఈ నెల 17న (మంగళవారం) రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను గుర్తు చేసుకున్నారు.

**గోస తీర్చిన నాయకుడు**

"నీళ్లు లేని గోస, కరెంట్ లేని కష్టాలను తీర్చిన ఏకైక నాయకుడు కేసీఆర్. ఒక ఆడబిడ్డ పెళ్లికి కల్యాణ లక్ష్మి ద్వారా లక్ష రూపాయలు ఇచ్చి మేనమామలా ఆదుకున్నారు. గర్భిణీలకు కేసీఆర్ కిట్, రైతులకు రైతు బంధు, వృద్ధులకు ఆసరా పెన్షన్లు (రూ.200 నుంచి రూ.2016 పెంపు) అందించి ప్రజల గుండెల్లో నిలిచిపోయారు." అని తలసాని కొనియాడారు. విద్యార్థుల కోసం గురుకులాలు, విదేశీ విద్య కోసం ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు, సాగునీటి కోసం కాళేశ్వరం ప్రాజెక్టును తెచ్చిన దార్శనికుడు కేసీఆర్ అని అన్నారు.

**తెలంగాణ భవన్‌లో సంబరాలు**

కేసీఆర్ పుట్టినరోజున రాష్ట్రవ్యాప్తంగా ఆలయాలు, మసీదులు, చర్చీలల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించాలని కోరారు. ఇక రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఉదయం 10 గంటలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొంటారని చెప్పారు.

# గూడెం' కార్పొరేషన్ పీఠంపై వీడిన ఉత్కంఠ..!

* **పొత్తు కుదుర్చుకున్న కాంగ్రెస్, సీపీఐ**
* **చెరో రెండున్నరేళ్లు మేయర్ పీఠం పంచుకున్న పార్టీలు**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ తొలి మేయర్ పీఠాన్ని కమ్యూనిస్టు పార్టీ దక్కించుకుంది. గత మూడు రోజులుగా కొనసాగిన ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. కాంగ్రెస్ పార్టీతో జరిగిన చర్చల్లో సీపీఐ పార్టీకి మేయర్ పీఠాన్ని కేటాయిస్తూ నిర్ణయం తీసుకోవడంతోపాటు పొత్తులో భాగంగా రెండు పార్టీలు చెరొక రెండున్నరేళ్లు మేయర్ పీఠాన్ని అధిష్టించే విధంగా పొత్తును కుదుర్చుకున్నాయి. మొత్తం 60 స్థానాలు ఉన్న కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో 22 స్థానాల్లో సీపీఐ, 22 స్థానాల్లో కాంగ్రెస్ గెలుపొందగా, 8 మంది బీఆర్ఎస్ నుంచి, 6గురు ఇండిపెండెంట్లు, బిజెపి, సిపిఎం ఒక్కో స్థానాన్ని చేజిక్కించుకున్నాయి. ఏ పార్టీకి మెజారిటీ రాకపోవడంతో మేయర్ పీఠం ఎవరు సొంతం చేసుకుంటారనే విషయంపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అన్ని రాజకీయ పార్టీలు కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ ఎన్నికపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. అయితే తొలుత సీపీఐకి బీఆర్ఎస్ మద్దతు ఇస్తామని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆఫర్ ప్రకటించారు. దీంతో బీఆర్ఎస్‌తోపాటు ఇండిపెండెంట్ల మద్దతుతో సీపీఐ మేయర్‌పీఠం చేజిక్కించుకుంటుందని వార్తలొచ్చాయి. కాంగ్రెస్ మద్దతుతో గెలిచిన సీపీఎం అభ్యర్థితోపాటు మరుసటిరోజే ముగ్గురు ఇండిపెండెంట్లు కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతున్నారని, అదేవిధంగా మరో ముగ్గురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలోకి మారుతున్నట్లు ప్రచారం జోరుగా సాగింది. వారి మద్దతుతో కాంగ్రెస్ పార్టీ మేయర్ పీఠం కైవసం చేసుకునే ప్రయత్నం చేస్తుందని, అందుకుగాను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రయత్నిస్తున్నారని వార్తలొచ్చాయి. కాగా సీఎం రేవంత్‌రెడ్డి సీపీఐ నాయకులతో జరిపిన చర్చలు సఫలీకృతం కావడంతో తిరిగి సీపీఐ, కాంగ్రెస్ పొత్తు ఖరారు అయ్యింది. ఈ నేపథ్యంలోనే ఆ రెండు పార్టీలు కలిసి మేయర్ పదవిని రెండున్నరేళ్ల చొప్పున పంచుకున్నాయి. దీంతోసోమవారం మేయర్ ఎన్నిక సజావుగా సాగనున్నట్లు తెలుస్తోంది.

*** తొలి మేయర్‌గా మూడ్ గణేష్..?**

కొత్తగూడెం కార్పొరేషన్ తొలి మేయర్ పీఠం గిరిజనులకు రిజర్వు కావడంతో ఎవరు అధిష్టిస్తారని తొలినుంచి చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్, సిపిఐ మధ్య పొత్తు కుదిరిన నేపథ్యంలో తొలి మేయర్ పీఠాన్ని సీపీఐకు చెందిన వారికి కేటాయించారు. ఈ నేపథ్యంలో సీపీఐ నుంచి ఎవరు మేయర్‌గా ఎన్నికవుతారనే చర్చ ప్రారంభమైంది. సీపీఐ పార్టీ నుంచి ఎస్టీలు అయిన 20వ డివిజన్ కార్పొరేటర్ మూడ్ గణేష్, 52వ డివిజన్ కార్పొరేటర్ బానోత్ కళావతి, 31వ డివిజన్ కార్పొరేటర్ నూనావత్ శ్యామల పేర్లు తెరపైకి వచ్చాయి. దాదాపుగా మహిళకే తొలి మేయర్ పీఠం కేటాయిస్తారని ప్రచారం జరిగినప్పటికీ చివరకు అధిష్టానం 20వ డివిజన్ కార్పొరేటర్ మూడ్ గణేష్ వైపు మొగ్గుచూపింది. సుజాతనగర్ మండలంలో ఉన్న ఈ డివిజన్‌లో సిపిఐ నుంచి గణేష్, కాంగ్రెస్ పార్టీ నుంచి బానోత్ కోటేష్ నాయక్ పోటీ చేయగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపై 277 ఓట్ల మెజారిటీతో గణేష్‌గెలుపొందాడు.

*** కాంగ్రెస్ కార్పొరేటర్‌కు డిప్యూటీ మేయర్ పదవి**

సిపిఐ, కాంగ్రెస్ పార్టీల పొత్తులో భాగంగా మేయర్‌తోపాటు డిప్యూటీ మేయర్ పదవిని సైతం చెరొక రెండున్నరేళ్లు పంచుకున్నారు. అయితే తొలి డిప్యూటీ మేయర్‌గా కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. మేయర్ పీఠానికి మరో రెండున్నరేళ్లు సమయం ఉండటంతో డిప్యూటీ మేయర్ పదవి కోసం కాంగ్రెస్ పార్టీలోని ఆశావహుల్లో ఆశలు చిగురించాయి. ఈ పార్టీ నుండి సీనియర్లు అయిన కార్పొరేటర్లు పదవిని ఆశిస్తున్నారు. ముఖ్యంగా 15వ డివిజన్ కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ, 25వ డివిజన్ కార్పొరేటర్ కనుకుంట్ల శ్రీనివాసరావు, 26వ డివిజన్ కార్పొరేటర్ దుంపల రాజేశ్వరరావు, 59వ డివిజన్ కార్పొరేటర్ రావి రాంబాబు, 6వ డివిజన్ కార్పొరేటర్ భూక్య శ్రీనివాసరావుల పేర్లు ప్రధానంగా విన్పిస్తున్నాయి. వీరిలో బి.శ్రీనివాసరావు మేయర్ పీఠం కోసం తీవ్రంగా కృషి చేసినట్లు తెలుస్తోంది. తొలి డిప్యూటీ మేయర్ పదవిని ఎవరు అధిరోహిస్తారో వేచి చూడాల్సి ఉంది.

# చారిత్రాత్మక ఆలయాలను పర్యాటకంగా అభివృద్ధికి కృషి

* **మహాశివరాత్రి సందర్భంగా పాన గల్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు..**
* **రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు అందజేసిన మంత్రి..**



ప్రజా స్ఫూర్తి, నల్గొండ : నల్లగొండ జిల్లా కేంద్రంలోని పానగల్ ఛాయా సోమేశ్వరాలయాన్ని ప్రపంచ వార సత్వ సంపదగా యునెస్కో గుర్తిం చాలని రాష్ట్ర రోడ్లు,భవనాలు, సి నిమటోగ్రాఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. మహాశివ రాత్రి సందర్భంగా ఆదివారం నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పా నగల్ లోని చారిత్రాత్మక పచ్చల, ఛాయా సోమేశ్వరాలయాలలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రా లు అందజేశారు. అనంతరం ఆయన మీడియా తో మాట్లాడుతూ పానగల్ లోని పచ్చ ల,ఛాయా సోమేశ్వరాలయాలను ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభి వృద్ధి చేయాలన్నదే తన తపన అ న్నారు.ఛాయా సోమేశ్వరాలయా నికి యునెస్కో గుర్తింపు వల్ల ఎన్నో నిధులు వస్తాయని తెలిపారు.కేంద్రం కేంద్ర ప్రభుత్వం దృష్టికి కూ డా తీసుకెళ్లి వారసత్వ సంపదగా గుర్తించే విధంగా చర్యలు తీసుకుం టానని పేర్కొన్నారు. 11, 12 వ శ తాబ్దంలో చోళులు ఈ ఛాయా సో మేశ్వరాలయంను నిర్మించారన్నా రు. గర్భగుడిలో శివలింగం మీద రోజంతా ఒక స్తంభం నీడ నిరంత రంగా పడడం మహా అద్భుతమని పేర్కొన్నారు. యునెస్కో జాబితా లో చేరడం వల్ల దేవాలయాల యొక్క విశిష్టత ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందుతుందన్నారు. అంతర్జాతీయ మాధ్యమాలలో వి స్తృత ప్రచారం జరుగుతుందన్నా రు. దీంతో పర్యాటకం పెరగడం వ ల్ల ఆర్థిక ప్రయోజనాలు కలుగుతా యని తెలిపారు. స్థానికులకు తమ వారసత్వ సంపద గురించి అవగా హన పెరుగుతుందని అన్నారు. ప చ్చల,ఛాయా సోమేశ్వరాలయం గోడలపై అద్భుత శిల్పకళ ఉంద న్నారు. పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తానని మంత్రి స్పష్టం చేశారు.

# హిల్ కౌంటీ సమస్య పరిష్కారానికి తాను వ్యక్తిగతంగా జోక్యం చేసుకుంటా


* **మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్**



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : హిల్ కౌంటీ సమస్య పరిష్కారానికి తాను వ్యక్తిగతంగా జోక్యం చేసుకుంటానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. హిల్ కౌంటీ విల్లాస్, బాచుపల్లి మహిళలు చేపట్టిన శాంతియుత రిలే నిరాహార దీక్షను మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన దీక్షలో పాల్గొన్న మహిళలతో మాట్లాడి, సమాజంలో నెలకొన్న సమస్యలను ఆత్మీయంగా విన్నారు దీక్షలో పాల్గొంటున్న మహిళలు నవత, తనుజ, జ్యోతి, భారణి, రేణుకా దేవి, విజయ, కవిత, మంజుల కు సంఘీభావంగా ఈటల రాజేందర్ నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా సమాజంలో చోటుచేసుకున్న ఆర్థిక అవకతవకలపై న్యాయమైన , పారదర్శక దర్యాప్తు జరపాలని కోరుతూ బాచుపల్లి పోలీసులకు ఎంపీ సమక్షంలో ప్రతినిధి పత్రం సమర్పించారు. దేశవ్యాప్తంగా రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ల పరిపాలనను బలోపేతం చేయడానికి, సంబంధిత చట్టాలలో సంస్కరణలు చేయాలని కోరుతూ జాతీయ స్థాయి ప్రతినిధి పత్రం కూడా సమర్పించారు

# సేవాలాల్ మహారాజ్ బంజారా ప్రజలకు దేవుడితో సమానం

* **అల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్**



శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : సేవాలాల్ మహారాజ్ బంజారా ప్రజలకు దేవుడితో సమానం అని అల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ అన్నారు. బంజారాల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి సందర్భంగా బంజారా యువ నాయకులతో కలిసి మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పీజేఆర్ నగర్లో సేవాలాల్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు,. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందు ధర్మం గొప్పతనం బంజారాలకు తెలియజేయడానికి జన్మించిన మహానుభావుడన్నారు. గిరిజనుల ఆరాధ్య దైవం, వారి అభ్యున్నతి , శ్రేయస్సు కోసం అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడు సేవాలాల్ అని అన్నారు. ఆయన బంజారా సమాజానికి సేవ చేసి మహోన్నతమైన స్థానాన్ని అందుకున్నారని అన్నారు. బంజారా ప్రజల సంక్షేమం కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన మహనీయుడు సంత్ సేవాలాల్ మహారాజ్ అని, అంతటి గొప్ప మహాయోధుడికి నివాళులు అర్పిస్తూ స్మరించుకోవడం గొప్ప విషయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, షౌకత్ అలీ మున్నా, పోశెట్టిగౌడ్, యాదగిరి, బాబు నాయక్, వెంకటేష్, పాండు, హనుమంత్, రాజు గౌడ్, కృష్ణ, కిషన్, మల్లేష్, రవి నాయక్, నరయ్య, హరీష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ లో 196 మందిపై కేసు నమోదు

సైబరాబాద్, ప్రజాస్ఫూర్తి : సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్ డిసిపి రంజన్ రతన్ కుమార్ తెలిపారు. ఈ డ్రైవ్‌లో భాగంగా మొత్తం196మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశామున్నారు. వీరిలో 140 ద్విచక్ర వాహనదారులు, 13 ఆటోలు,41 కార్లు, 2 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయని వివరించారు. బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఎసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే 157 మంది 36 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 200 ఎం జీ/100 ఎంఎల్ మధ్య,26 మంది 201 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 300 ఎం జీ/100 ఎంఎల్ మధ్య,13 మంది 301 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 550 ఎం జీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు.వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు ఆయన తెలిపారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని డీసీపీ పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత -2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు. గత వారం లో మొత్తం 212 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి. వీరిలో జైలు ఆరుగురికి జరిమానా, సోషల్ సర్వీస్, 206మందికి జరిమానా విధించినట్లు తెలిపారు.

# పారదర్శకంగా మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక

* **నేడు ప్రమాణ స్వీకారం చేయనున్న కార్పోరేటర్లు..**




ప్రజా స్ఫూర్తి, నల్గొండ : నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం, మేయర్, డిప్యూటీ మేయర్ పరోక్ష ఎన్నికల కార్యక్రమాన్ని పారదర్శకంగా శాంతి యుతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు అదనపు ఎన్నికల అధికారి, నల్గొండ మున్సిపల్ కమిషనర్ బి. శరత్ చంద్ర తెలిపారు. నిర్వహణకు సంబంధించి సమగ్ర ఏర్పాట్లపై ఆదివారం మున్సిపల్ కార్పోరేషన్లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం కౌన్సిల్ హాల్‌ను ప్రత్యక్షంగా పరిశీలించి, కార్పొరేటర్లు, ఆహ్వానితులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కూర్చోవడానికి తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అలాగే సౌండ్ సిస్టమ్, తాగునీరు, విద్యుత్ సరఫరా, భద్రతా ఏర్పాట్లు, మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేక స్థలం, పార్కింగ్ సదుపాయాలు తదితర అంశాలపై సంబంధిత అధికారులకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు. కార్యక్రమం నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా ప్రతి విభాగం సమన్వయంతో పనిచేయాలని, అప్పగించిన బాధ్యతలను కచ్చితంగా నిర్వర్తించాలని అధికారులను ఆదేశించారు.

# కొత్తగూడెంలో సేవా కార్యక్రమం.. ప్రభుత్వ ఆసుపత్రికి కుర్చీల విరాళం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం మిలీనియం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ ప్రెసిడెంట్ లయన్ బొక్క శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా 14 నెంబర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి 6 కుర్చీలు అందజేశారు.ఈ సందర్భంగా మిలీనియం క్లబ్ ప్రెసిడెంట్ లయన్ బొక్క శ్రీనివాస్ మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ సమాజ సేవలో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన చోట సహాయం చేయడం క్లబ్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో క్లబ్ ట్రెజరర్ లయన్ పగడాల నగేష్, డిస్ట్రిక్ట్ జాయింట్ ట్రెజరర్ లయన్ పితాని సత్యనారాయణ, డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్స్ లయన్ జె.బి. మోహన్, లయన్ మండల రాజేశ్వరరావు, సీనియర్ లయన్ ది. బాబురావు, బిట్టు గోవర్ధన్, టీ. శరథబాబు, సురేష్ పాల్గొన్నారు.అదేవిధంగా ఆసుపత్రి సిబ్బంది సీనియర్ నర్స్ బి. శంకరమ్మ, బి. రాజేశ్వరి, స్ఫూర్తి, సుదర్శన్ కార్యక్రమంలో పాల్గొని క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# శివరాత్రి సందర్భంగా కూచిపూడి నృత్య ప్రదర్శన



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ భారతి నాట్యాలయం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. పట్టణంలోని శ్రీశ్రీశ్రీ మహాంకాళి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగింది.నాట్య గురువు పర్వీన్ చంద్ర మార్గదర్శకత్వంలో విద్యార్థులు శివతాండవం, పార్వతీ పరమేశ్వరుల దైవ లీలలను నృత్య రూపంలో ఆవిష్కరించారు. భావ, రాగ, తాళ సమన్వయంతో కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.మహా శివరాత్రి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి కొత్తగూడెం ప్రాంతానికి చెందిన భక్తులు, కళాభిమానులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. సంప్రదాయ కళలను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

# మేయర్ పీఠం ఎవరిది? కరీంనగర్‌లో రసవత్తరంగా మారిన రాజకీయం

* కరీంనగర్ కార్పొరేషన్‌లో రసవత్తరంగా మారిన మేయర్ ఎన్నిక
* కాంగ్రెస్ పార్టీలో చేరిన ఐదుగురు స్వతంత్ర, ఇతర పార్టీల కార్పొరేటర్లు
* కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించిన ఎంఐఎం, మరో స్వతంత్ర కార్పొరేటర్
* అతిపెద్ద పార్టీగా బీజేపీ.. మేయర్ పీఠానికి అవసరమైన బలానికి దూరం
* మంత్రుల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కొత్త కార్పొరేటర్లు



కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, మేయర్ పీఠం ఎవరికి దక్కుతుందనే దానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. పలువురు స్వతంత్ర, ఇతర పార్టీల కార్పొరేటర్లు కాంగ్రెస్‌కు మద్దతు పలకడంతో రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు సాయిజ్యోతి, శ్యామలతో పాటు, స్వతంత్రులుగా గెలిచిన కొమరయ్య, నందిని ఉదయ్, మల్లేశం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మొత్తంగా ఐదుగురు కార్పొరేటర్లు హస్తం గూటికి చేరారు. హైదరాబాద్‌లో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. ఇదే సమయంలో, ఎంఐఎంకు చెందిన ముగ్గురు కార్పొరేటర్లతో పాటు, మరో స్వతంత్ర అభ్యర్థి మాజీద్ హుస్సేన్ కూడా కాంగ్రెస్ పార్టీకి తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. "కరీంనగర్ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని తాము బలంగా నమ్ముతున్నామని, అభివృద్ధిని ఆకాంక్షించే కాంగ్రెస్‌లో చేరామని" పార్టీలో చేరిన కార్పొరేటర్లు తెలిపారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం 66 డివిజన్లకు ఎన్నికలు జరిగాయి. ఫలితాల ప్రకారం బీజేపీ 30 సీట్లు గెలుచుకుంది. కాంగ్రెస్ 14, బీఆర్ఎస్ 9 సీట్లు సాధించాయి. మిగిలిన సీట్లు ఇండిపెండెంట్లు, ఎఐఎఫ్‌బీ వంటి చిన్న పార్టీలు గెలుచుకున్నాయి. మొత్తం కార్పొరేషన్ బలం 69 (66 ఎన్నికైన సభ్యులు + 3 ఎక్స్‌అఫీషియో సభ్యులు). మేయర్ పదవికి అవసరమైన మెజారిటీ మార్క్ 35. తాజా పరిణామాలతో కాంగ్రెస్ బలం పెరిగింది. అతిపెద్ద పార్టీగా ఉన్నప్పటికీ బీజేపీకి మెజారిటీకి అవసరమైన సంఖ్యాబలం లేదు. దీంతో మేయర్ పీఠం కోసం పోరు హోరాహోరీగా మారింది. మిగిలిన స్వతంత్రులు, ఇతర పార్టీల మద్దతుతో ఎవరు అధికారాన్ని చేజిక్కించుకుంటారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.




## హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు

* సింగపూర్-హైదరాబాద్ విమానంలో బాంబు పెట్టినట్లు మెయిల్
* విమానం ల్యాండ్ అవగానే తనిఖీలు చేపట్టిన సిబ్బంది
* బాంబు లభ్యం కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్న అధికారులు

హైదరాబాద్ : హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు వచ్చింది. ఈ మేరకు మెయిల్ ద్వారా బెదిరింపు అందింది. ఆదివారం ఉదయం సింగపూర్ హైదరాబాద్ విమానంలో బాంబు పెట్టినట్లు మెయిల్ రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. శంషాబాద్ విమానాశ్రయంలో విమానం ల్యాండ్ కాగానే ప్రయాణికులను కిందకు దింపి, తనిఖీలు చేపట్టగా, బాంబు లభ్యం కాలేదు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఈ బెదిరింపు మెయిల్ ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరు పంపించారు అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గత డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు ఈ రెండు నెలల వ్యవధిలో శంషాబాద్ విమానాశ్రయానికి 23 నకిలీ బాంబు బెదిరింపు కాల్స్ వచ్చినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. కొన్ని ఫోన్ కాల్స్ విదేశాల నుంచి వచ్చినట్లు కూడా గుర్తించారు.

## అమెరికా భారత్ వాణిజ్య ఒప్పందంలో రాహుల్ గాంధీ కుట్రలు

: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
* రైతులు, ఎగుమతి దారుల్లో ఆందోళనలు కలిగించేలా ఎత్తులు
* వారి బూటకపు మాటలను దేశ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు



భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంపై విపక్షనేత రాహుల్ గాంధీ ఇటీవల చేసిన వ్యాఖ్యలు రైతులు, ఎగుమతిదారుల్లో భయాందోళనలు కలిగించే కుటిల ప్రయత్నమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. వ్యతిరేక రాజకీయాల ద్వారా దేశ పురోగతిని వెనక్కు లాగేందుకు కుట్రలు పన్నుతున్నారుని ఆయన దుష్ప్రచారాన్ని ప్రజలు అంగీకరించరని పేర్కొన్నారు. ఆదివారం ఎక్స్‌వేదికగా స్పందిస్తూ ప్రస్తుతం భారత్ రూ.4 లక్షల కోట్ల విలువైన వస్త్రాలను ఎగుమతి చేస్తోంది. 38 అభివృద్ధి చెందిన దేశాల పరిధిలోని 9 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు ద్వారా రూ. 45 లక్షల కోట్ల విలువైన టెక్స్‌టైల్ మార్కెట్‌కు అవకాశాలు ఏర్పడ్డాయని తెలిపారు. కేంద్రం దేశవ్యాప్తంగా 7 మెగా టెక్స్‌టైల్స్ పార్కులను అభివృద్ధి చేస్తోందని అందులో ఒకటి వరంగల్‌లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పేరుతో డెవలప్ అవుతోందన్నారు. మరోవైపు పత్తి డిమాండ్ తగ్గుతుందని రైతులను భయపెట్టేందుకు, ఆందోళనకు గురిచేసేందుకు ప్రయత్నిస్తున్నారు. భారత వస్త్ర పరిశ్రమ రంగంలో విస్తారమైన వృద్ధి అవకాశాలు ఉన్నందున భారత పత్తికి డిమాండ్ నిరంతరం పెరుగుతుంది. దీని ద్వారా రైతుల ఆదాయం కూడా పెరుగుతుంది. రైతులు ఏమాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అన్నదాతల విషయంలో అన్యాయంగా వ్యవహరించినందుకు కాంగ్రెస్ పార్టీ సిగ్గుపడాలి. డాక్టర్ ఎమ్మెస్ స్వామినాథన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జాతీయ రైతు సంఘం సిఫారసులను అమలు చేసే ప్రసక్తే లేదని 2013లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం స్పష్టం చేసిందని గుర్తు చేశారు. ఉత్పత్తి వ్యయం కంటే కనీసం 50 శాతం ఎక్కువగా కనీస మద్దతు ధర ఉండాలని స్వామినాథన్ కమిటీ సూచించింది. దీనిని కాంగ్రెస్ ప్రభుత్వం అంగీకరించలేదు. తరువాత ఏర్పడిన మోడీ ప్రభుత్వం ఉత్పత్తి వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుని ఎంఎస్పీ విధానాన్ని అమలు చేసింది. రైతుకు అయ్యే ఉత్పత్తి వ్యయానికి రెట్టింపు ఆదాయం అందించే లక్ష్యంతో కేంద్రం పనిచేస్తోంది. ఇప్పటివరకు వరుసగా 100 ఎన్నికల్లో వరుస పరాజయాల తర్వాత రాహుల్ గాంధీ నిరాశ, నిస్పృహలతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. మోడీపై ఉన్న వ్యతిరేకతను దేశంపై వ్యతిరేకతగా మలచుకున్నారు. అందుకే 11 ఏళ్లుగా దేశం సాధిస్తున్న ప్రగతిని చూసి జీర్ణించుకోలేక, అధికారం దక్కదన్న అసహనంతో దేశంలో అన్నదాతలను, ఎగుమతిదారులను రెచ్చగొట్టేందుకు విఫలయత్నం చేస్తున్నారని వీటిని ప్రజలు తిప్పికొడతారని పేర్కొన్నారు.


## నిజామాబాద్‌లో బీజేపీ తప్పుకుంది కదా కరీంనగర్ మేయర్ పదవిపై పొన్నం ప్రభాకర్



కరీంనగర్ : కరీంనగర్ మేయర్ పదవిపై తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్ కార్పొరేషన్‌ను కాంగ్రెస్ పార్టీయే దక్కించుకుంటుందని వ్యాఖ్యానించారు. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ 30, కాంగ్రెస్ 14, బీఆర్ఎస్ 9, మజ్లిస్ మూడు, ఇతరులు 10 స్థానాలు దక్కించుకున్నారు. ఇందులో ముగ్గురు ఇప్పటికే బీజేపీలో చేరారు. మేయర్ పదవిని దక్కించుకోవడానికి 34 కౌన్సిలర్ల మద్దతు అవసరం. ఇక్కడ బండి సంజయ్ ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఓటు వేయవచ్చు. ఈ క్రమంలో బీజేపీకే ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి మాట్లాడుతూ, నిజామాబాద్‌లో మేయర్ పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ధర్మపురి అరవింద్ ప్రకటించారని గుర్తు చేశారు. పూర్తి మెజారిటీ రాకపోవడంతో ఆ నిర్ణయం తీసుకున్నట్లు స్వయంగా ఎంపీ తెలిపారని అన్నారు. కరీంనగర్‌లో మెజారిటీ లేకుండానే మేయర్ పదవి దక్కించుకుంటామని బండి సంజయ్ ఎలా చెబుతారని ప్రశ్నించారు. కార్పొరేషన్‌లలో ప్రజాస్వామ్యబద్ధంగా మేయర్‌ను ఎన్నుకుంటారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తరపున అభివృద్ధికి సహకరిస్తామని, అందరినీ కలుపుకుని మేయర్ పీఠం దక్కించుకోవడానికి ప్రయత్నిస్తామని పొన్నం ప్రభాకర్ అన్నారు. మేయర్ పదవి దక్కించుకోవడానికి బీజేపీ ఎలాంటి ప్రయత్నాలు చేస్తుందో తామూ అదేవిధంగా చేస్తున్నామని అన్నారు. మేయర్, ఛైర్ పర్సన్ పదవుల కోసం క్యాంపు రాజకీయాలు ఉంటాయని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

## హంగ్ మున్సిపాలిటీల కోసం కాంగ్రెస్ అరాచకం: కేటీఆర్

* కౌన్సిలర్లను కిడ్నాప్ చేస్తున్నారంటూ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్
* 34 మున్సిపాలిటీల్లో అధికారం కోసం కాంగ్రెస్ అడ్డదారులు తొక్కుతోందంటూ విమర్శలు
* కౌన్సిలర్లను కిడ్నాప్ చేస్తూ, ప్రలోభాలకు గురిచేస్తోందని కేటీఆర్ ఆరోపణ
* సింగరేణి కార్మికుల ప్రయోజనాల కోసమే కొత్తగూడెంలో సీపీఐకి మద్దతు




హైదరాబాద్ :రాష్ట్రంలో ఇటీవల ఎన్నికలు జరిగిన మున్సిపాలిటీల్లో హంగ్ ఏర్పడిన 34 చోట్ల అధికారాన్ని చేజిక్కించుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ అరాచకాలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. కౌన్సిలర్లను కిడ్నాప్ చేయడం, ప్రలోభ పెట్టడం, ఇళ్లకు పోలీసులను పంపడం, గూండాలను ఉపయోగించడం వంటి చర్యలకు దిగుతోందని ఆయన విమర్శించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో జరిగిన సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. సోమవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, మేయర్ల ఎన్నిక జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని మండిపడ్డారు. కొత్తగూడెం మున్సిపాలిటీలో సింగరేణి కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే సీపీఐకి మద్దతిస్తున్నట్లు కేటీఆర్ స్పష్టం చేశారు. సింగరేణి సంస్థను దోచుకోవడంలో కాంగ్రెస్, బీజేపీ రెండూ భాగస్వాములేనని, సంస్థకు నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. సీపీఐకి అనుబంధంగా ఉన్న ఏఐటీయూసీ కూడా కాంగ్రెస్‌తో పొత్తును ఎలా అంగీకరించిందో అర్థం కావడం లేదని, దీని వెనుక ఎలాంటి ఒత్తిళ్లు ఉన్నాయో తెలియదన్నారు. ఎవరు కలిసినా, కలవకపోయినా సింగరేణి కార్మికుల హక్కుల కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని ఆయన తేల్చిచెప్పారు. గతంలో తమ ప్రభుత్వం గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి, వేలాది మంది గిరిజన యువతకు రాజకీయ అవకాశాలు కల్పించిందని కేటీఆర్ గుర్తుచేశారు. సుమారు 4.5 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇచ్చి గిరిజనుల భూ హక్కులను కాపాడామని తెలిపారు.

## తెలంగాణ మీడియా అకాడమీలో జర్నలిస్టులకు ప్రత్యేక శిక్షణ

* 18న భూమి చట్టాలు - వ్యవసాయం - గ్రామీణ అభివృద్ధి - పర్యావరణంపై శిక్షణ కార్యక్రమం
* తెలంగాణ సోషల్ మీడియా ఫోరం అధ్యక్షుడు కరుణాకర్ దేశాయ్






గ్రామీణ, పట్టణ ప్రాంతం అని తేడా లేకుండా జర్నలిస్టందరికీ ప్రభుత్వ కార్యకలాపాలు, అమలు చేస్తోన్న చట్టాలు, చేపట్టిన ప్రభుత్వ పథకాలపై అవగాహన అవసరమని తెలంగాణ సోషల్ మీడియా ఫోరం అధ్యక్షులు కరుణాకర్ దేశాయ్ పేర్కొన్నారు. సామాన్యులకు తమ వంతు సేవ చేయాలనుకునే జర్నలిస్టులకు చట్టాలపైనా సంపూర్ణ అవగాహన అనివార్యమని తెలిపారు. అందుకే గ్రామీణ జర్నలిస్టులకు భూమి హక్కులు, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఇంకా పలు అంశాలపై ఈ నెల 18న తెలంగాణ ప్రెస్ అకాడమిలో ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టామని, ఇందుకు "తెలంగాణ మీడియా అకాడమీ" ఆమోదం తెలిపినట్లు తెలంగాణ సోషల్ మీడియా ఫోరం అధ్యక్షుడు కరుణాకర్ దేశాయి తెలిపారు. తెలంగాణ సోషల్ మీడియా ఫోరం ద్వారా రిజిస్టర్ చేసిన రూరల్ జర్నలిస్టులకు విడుతల వారీగా అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్లాసులు నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు.

## మా డబ్బు, గిఫ్ట్‌లు మాకివ్వండి
## ఇంటింటికి వెళ్లి అడుగుతున్న ఓడిపోయిన అభ్యర్థులు

* ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు బహుమతులు ఇచ్చిన అభ్యర్థులు
* మూడుచింతలపల్లి, మంచిర్యాల, భువనగిరిలో బహుమతులు వెనక్కి అడుగుతున్న అభ్యర్థులు
* ఇంటింటికి తిరిగి వసూలు చేసే ప్రయత్నం



హైదరాబాద్: తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో ఓడిపోయిన కొందరు అభ్యర్థులు తాము పోలింగ్‌కు ముందు పంచిన నగదు, చీరలు, ఇతర బహుమతులు ఇవ్వాలంటూ ఓటర్లను అడగటం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు ఓటర్లను ప్రభావితం చేయడానికి డబ్బుతో పాటు ఇతర బహుమతులు పంచుతుంటారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని మూడుచింతలపల్లి పొన్నాల వార్డులో ఓ అభ్యర్థి తాను పంచిన వాటిని తిరిగివ్వాలని ఓటర్లను అడుగుతున్నారు. ఎన్నికలకు ముందు తాను ఇచ్చిన మందు, చీరలు, డబ్బు తిరిగి ఇవ్వాలని ఈ వార్డులో ఓడిపోయిన ఓ అభ్యర్థి అడుగుతున్నారు. సదరు అభ్యర్థి ఇంటింటికి తిరుగుతూ తన బహుమతులు వసూలు చేసుకునే ప్రయత్నం చేయడం గమనార్హం. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లోని తొమ్మిదవ వార్డులో కూడా ఓ అభ్యర్థి తనకు ఎవరెవరు ఓటు వేశారు, ఎవరు వేయలేదో ఇంటింటికి వెళ్లి లెక్కలు వేసుకుంటున్నారు. తనకు ఓటు వేయని వారు తాను ఇచ్చిన బహుమతులను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి మున్సిపాలిటీలోనూ ఒకటో వార్డులో ఓడిపోయిన ఒక అభ్యర్థి తాను పంచిన చీరలు, హాట్ బాక్సులు తిరిగి ఇవ్వాలని ఇంటింటికి వెళుతున్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన గొర్రెలకాపరి నాగమ్మ




నారాయణపేట : జీవితం ఎప్పుడైనా మారిపోవచ్చనేదానికి ఇది మరో ఉదాహరణ. ఏమాత్రం చదువు లేని ఒక అమాయకురాలు ఊహించని విధంగా ప్రజాప్రతినిధి అయిపోయింది. వివరాల్లోకి వెళితే... నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలో ఉండే బొడ్డేమొల్ల నాగమ్మ ప్రకృతిని నమ్ముకుని బతుకుతున్న ఒక సాధారణ గృహిణి. ఆమెకు చదువు లేదు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అసలు తెలియదు. గొర్రెలను పెంచుతూ జీవనోపాధిని పొందుతున్న సామాన్యురాలు. కానీ, ఆమెను అదృష్టం వెతుక్కుంటూ వచ్చింది. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో నారాయణపేట మున్సిపాలిటీలో 19వ వార్డు నుంచి పోటీ చేయాలంటూ పట్టణ బీజేపీ నాయకత్వం ఆమెకు అవకాశం ఇచ్చింది. రాజకీయాలు తెలియని ఆమె... ధైర్యంగా తన భర్త అండతో ఎన్నికల బరిలోకి దిగింది. భర్తతో పాటు, వార్డులో ఉన్న యువత సహకారంతో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసింది. తనను గెలిపిస్తే గృహిణులకు, వ్యవసాయదారులకు బీజేపీ తరపున అండగా ఉంటానని... అందరి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇస్తూ ప్రచారం చేసింది. చివరకు ఎన్నికల్లో ఆమె జయకేతనం ఎగురవేసింది. తన ప్రత్యర్థి సరిత సతీశ్ గౌడ్ పై 154 ఓట్ల మెజార్టీతో 19వ వార్డు కౌన్సిలర్ గా గెలుపొందింది. ఎన్నికల్లో గెలుపొందిన నాగమ్మను ఇతర పార్టీల నేతలు కూడా అభినందిస్తున్నారు.

## ఎములాడ రాజన్నకు పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం

రాష్ట్రంలోని శైవ క్షేత్రాలు మహాశివరాత్రి శోభను సంతరించుకున్నాయి. ఆదివారం పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు. పరమశివుడికి అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నారు. భక్తుల రద్దీతో ఆలయాలు ఓం నమఃశివాయ నామస్మరణతో మార్మోగుతున్నాయి. వేములవాడ రాజన్న ఆలయం అనుబంధ దేవస్థానం భీమేశ్వర స్వామి క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. స్వామివారిని దర్శనానికి భారీ సభ్యలో భక్తులు తరలి వచ్చారు. కోడె మొక్కులు చెల్లించుకుంటున్నారు. ముక్కంటిని మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి పొన్నం ప్రభాకర్ భీమేశ్వరస్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించారు. కాగా, సాయంత్రం శంకర మఠంలో అనువంశిక అర్చకులతో మహా లింగార్చన ఉండనుంది. రాత్రి లింగోద్భవం సమయంలో స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. ఇక హనుమకొండలోని వేయి స్తంభాలగుడిలో రామలింగేశ్వరునికి భక్తులు రుద్రాభిషేకం చేస్తున్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరంలో భక్తుల రద్దీ కొనసాగుతున్నది. వేకువజాము నుంచే భక్తులు ముక్తేశరుని దర్శనానికి తరలి వచ్చారు.



# సామాన్యుల కోసమే 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్' - ప్రధాని మోదీ



గడిచిన దశాబ్ద కాలంగా రక్షణ రంగంలో తీసుకువస్తున్న సంస్కరణల ప్రయోజనాలు ఆపరేషన్ సిందూర్ సమయంలో స్పష్టంగా కనిపించాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భద్రతా సవాళ్లను ఎదుర్కొనేందుకు భారత్ ఎప్పుడూ సంసిద్ధతతో ఉండాలన్న ఆయన.. రక్షణ రంగాన్ని ఆధునికీకరించడంతోపాటు స్వయం సమృద్ధి సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పీటీఐ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చిన మోదీ.. అనేక అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు.

**వాణిజ్య ఒప్పందాలతో ప్రయోజనం..**

యూపీఏ ప్రభుత్వ హయాంలో వాణిజ్య చర్చలపై ప్రధాని మోదీ తీవ్ర విమర్శలు చేశారు. వారి ఆర్థిక నిర్వహణ సరిగ్గా లేని కారణంగా విదేశాలతో విశ్వసనీయతతో కూడిన చర్చలు జరపలేక పోయారన్నారు. తద్వారా ఏ చర్చలనూ పూర్తి చేయలేక పోయారని విమర్శించారు. తమ హయాంలో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, యూకే, ఈయూ, అమెరికాలతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాలతో ఎంఎస్ఎంఈలకు ఎంతో ప్రయోజనం చేకూరిందన్నారు. ముఖ్యంగా కార్మిక ఆధారిత రంగాలకు లబ్ధి చేకూరిందని, ఆయా దేశాలకు తక్కువ సుంకాలతోనే ఎగుమతులు చేసుకునే వీలు కలిగిందన్నారు.

**రక్షణ రంగానికి పెద్దపీట..**

అంతర్జాతీయంగా భారత్ అతి ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న దృష్ట్యా ప్రస్తుత వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత తమ ప్రభుత్వానికి ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అందుకే తాజా బడ్జెట్‌లో ఈ రంగానికి రూ.7.85లక్షల కోట్లు కేటాయించామన్నారు. తమ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల పథం సామాన్య పౌరులకు భారీ స్థాయిలో ప్రయోజనం చేకూరుస్తోందని చెప్పారు. రాబోయే దశాబ్దం పాటు నిర్మాణాత్మక సంస్కరణలు, లోతైన ఆవిష్కరణలు, పాలనను మరింత సరళీకరించడం.. ఈ మూడు ముఖ్యమైన సంస్కరణలనే ప్రధానంగా కొనసాగిస్తామన్నారు.

**మహిళలే కీలకం..**

'వికసిత్ భారత్' సృష్టించడంలో మహిళలు అత్యంత ముఖ్యమైన పాత్ర పోషిస్తారని, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వారిని శక్తిమంతం చేస్తాయని ప్రధాని మోదీ అన్నారు. అంతరిక్షం, స్టార్టప్ వంటి అనేక రంగాల్లో వీరు గొప్ప ప్రభావాన్ని చూపిస్తున్నారని గుర్తు చేశారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో స్వల్పకాలిక ప్రజాదరణ పథకాల జోలికి వెళ్లలేదని.. ఉద్యోగాల కల్పన, సుస్థిరాభివృద్ధికి కావాల్సిన మౌలిక సదుపాయాల కోసమే భారీగా కేటాయింపులు చేశామని అన్నారు.

## రైతులకు ద్రోహం చేస్తున్నట్లే!
## ట్రేడ్ డీల్‌పై ప్రధానికి రాహుల్ ప్రశ్నలు



అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోన్న తీరుపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. వాణిజ్య ఒప్పందం పేరుతో భారతీయ రైతులు మోసపోవడాన్ని కళ్లారా చూస్తున్నామని, దేశ వ్యవసాయ సార్వభౌమత్వాన్ని రాజీ పడేలా చేస్తోందని ఉద్ఘాటించారు. ఇది తాత్కాలిక అంశం కాదని, రైతుల భవిష్యత్తుకు సంబంధించిందన్న ఆయన.. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి ఐదు ప్రశ్నలు సంధించారు.

* డీడీజీ (డ్రైడ్ డిస్టిల్లర్స్ గ్రెయిన్స్) దిగుమతి చేసుకోవడం అంటే ఏమిటీ? జన్యుమార్పిడి చేసిన (GM) అమెరికన్ మొక్కజొన్న నుంచి తయారైన దాణాను భారతీయ పశువులకు తినిపించడం కాదా? ఇది మన పాల ఉత్పత్తి అమెరికా వ్యవసాయ పరిశ్రమపై ఆధారపడేలా చేయదా?
* జన్యుమార్పిడి చేసిన సోయాబీన్ ఆయిల్‌ను అనుమతిస్తే.. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్‌లతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న సోయాబీన్ రైతులపై ప్రభావం పడదా?
* మీరు చెబుతున్న ఆ 'అదనపు ఉత్పత్తులు' అంటే ఏమిటీ..? కాలక్రమేణా పప్పుధాన్యాలతోపాటు ఇతర అమెరికన్ పంటల దిగుమతులకు ద్వారాలు తెరవడమేనా?
* వాణిజ్యేతర అడ్డంకులను తొలగించడం అంటే ఏమిటీ? జన్యుమార్పిడి పంటలపై తన వైఖరిని మార్చడం, ధాన్యం సేకరణను తగ్గించడం, కనీస మద్దతు ధర లేదా బోనస్‌లను తగ్గించడంపై భవిష్యత్తులో భారత్ ఒత్తిడిని ఎదుర్కోనుందా?
* ఒకసారి ద్వారాలు తెరిచిన తర్వాత వీటిలో మరిన్ని పంటలను చేర్చకుండా ఎలా ఆపగలం? వీటికి ఏమైనా రక్షణ చర్యలు ఉన్నాయా? లేదా ఇలాగే ప్రతి ఒప్పందంలో మరిన్ని పంటలను ఈ జాబితాలో చేరుస్తారా? అని రాహుల్ గాంధీ ప్రశ్నించారు.
* ఇది తాత్కాలిక అంశం కాదని, రైతుల భవిష్యత్తుకు సంబంధించిన అంశమని రాహుల్ పేర్కొన్నారు. భారత వ్యవసాయ రంగంపై మరో దేశం పట్టును సాధించేందుకు అనుమతి ఇస్తున్నామా? అని ఈ సందర్భంగా అనుమానం వ్యక్తం చేశారు.

## జమ్మూ కేంద్రంగా 'డిజిటల్ హవాలా'.. 8వేల నకిలీ ఖాతాలు గుర్తింపు

జమ్మూ కశ్మీర్ కేంద్రంగా సైబర్ నేరగాళ్లు నిర్వహిస్తోన్న 'డిజిటల్ హవాలా' వ్యవస్థను జాతీయ దర్యాప్తు సంస్థ ఛేదించింది. అంతర్జాతీయ స్కామ్ సిండికేట్‌లతో సంబంధం ఉన్న దాదాపు 8వేలకు పైగా నకిలీ బ్యాంక్ ఖాతాలను బ్లాక్ చేసింది. సైబర్ మోసాలతో దోచుకున్న డబ్బును వేర్పాటువాద, ఉగ్ర కార్యకలాపాలకు వినియోగించే ప్రమాదం ఉందని అధికారులు అనుమానిస్తున్నారు. వివిధ దర్యాప్తు సంస్థలతో కలిసి మూడేళ్లుగా చేస్తున్న విచారణతో ఈ డిజిటల్ హవాలా



వ్యవస్థ బట్టబయలయ్యింది. అక్రమ ఆర్థిక లావాదేవీలపై జమ్మూ కశ్మీర్ పోలీసులతోపాటు కేంద్ర దర్యాప్తు సంస్థలు ప్రత్యేకంగా దృష్టి పెడుతుండడంతో.. కొన్నేళ్లుగా నగదు అక్రమ రవాణాకు నేరగాళ్లు కొత్త పద్ధతులను అనుసరిస్తున్నట్లు తేలింది. సాధారణ హవాలా మార్గాలకు బదులు 'డిజిటల్ హవాలా'ను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. అనేక సందర్భాల్లో సాధారణ పౌరుల గుర్తింపు కార్డులను ఉపయోగించి షెల్ కంపెనీల పేర్లతో నకిలీ ఖాతాలు తెరుస్తున్నట్లు అధికారులు గుర్తించారు. వీటి ద్వారా రోజుకు రూ.లక్షల్లో డబ్బును ఇతర ఖాతాలకు మళ్లిస్తున్నట్లు వెల్లడైంది. బ్యాంకు అధికారులకు ఎలాంటి అనుమానం రాకుండా ఉండేందుకు భారీ నగదును చిన్న మొత్తాల్లో విభజిస్తూ లావాదేవీలు చేస్తుండటం గమనార్హం. ఈ ఖాతాల ద్వారా అమాయకుల నుంచి దోచుకున్న డబ్బులను నిందితులు ఎప్పటికప్పుడు క్రిప్టోకరెన్సీ రూపంలోకి మార్చుతున్నట్లు దర్యాప్తులో గుర్తించారు. ఇటువంటి హవాలా ఖాతాల కట్టడికి స్థానిక బ్యాంకులతో కలిసి పనిచేయాలని జమ్మూ కశ్మీర్ పోలీసులకు, ప్రభుత్వ విభాగాలకు ఎన్ఐఏ సూచించింది.

## పేలుళ్ల కోసం 'అన్సార్ ఇంటీరియం': డాక్టర్ టెర్రర్‌లో మరో కోణం..!



ఢిల్లీ ఉగ్రపేలుడు కేసులో తవ్వేకొద్దీ కొత్త కోణాలు బయటకు వస్తున్నాయి. ఉగ్రడాక్టర్లు అందరూ కలిసి ఏకంగా 'అన్సార్ ఇంటీరియం' పేరిట కొత్త టెర్రరిస్టు సంస్థనే ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. వాస్తవానికి ఈ డాక్టర్లు మొత్తం చాలాకాలం క్రితమే ర్యాడికలైజ్ అయ్యారు. అప్పట్లో ఈ సంస్థను ఏర్పాటు చేసినట్లు దర్యాప్తు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. ముజమ్మిల్ గనీ, ఉమర్ నబీ, ఆదిల్, ముజఫర్ మౌల్వీ ఇర్ఫాన్, కారీ ఆమిర్, తౌఫిల్ గాజి కలిసి ఏప్రిల్ 2022లో శ్రీనగర్‌లో సమావేశమయ్యారు. అదే సమయంలో వారు అన్సార్ ఇంటీరియం అనే సంస్థను ప్రారంభించారు. దీనికి ఆదిల్ చీఫ్‌గా నియమితులయ్యారు. మౌల్వీ ఇర్ఫాన్‌కు డిప్యూటీగా బాధ్యతలు అప్పగించారు. ఎవరెవరు ఏమి చేయాలనేది కూడా ముందే నిర్ణయించుకొని.. బాధ్యతలను పంచుకొన్నట్లు అరెస్టైన ఉగ్ర డాక్టర్లు వెల్లడించారు. వీరు ఆపరేషనల్ కోడ్స్ కూడా సిద్ధం చేసుకొన్నారు. ఉమర్ సమన్వయకర్త బాధ్యతలు తీసుకోగా.. గనీ ఫైనాన్స్, కొనుగోళ్లు విభాగాలను చూసేవాడు. ఈ గ్రూప్ 2023లో పేలుళ్లకు అవసరమైన మెటీరియల్, ఎరువులను సోహ్నా నుంచి కొనుగోలు చేసింది. ఇక ఉమర్ సూచనల మేరకు ఫరీదాబాద్‌లోని ఓ కెమికల్ షాప్ నుంచి పొటాషియం నైట్రేట్‌ను తెప్పించారు. ఇక ఉమర్ ఆన్‌లైన్ వీడియోలు చూసి ఐఈడీలను తయారు చేయడం నేర్చుకొన్నట్లు ఇంటరాగేషన్‌లో తేలింది. ఆదిల్ దక్షిణ కశ్మీర్‌కు చెందిన డానిష్‌ను అల్‌ఫలా విశ్వవిద్యాలయానికి తీసుకొచ్చి ఉంచాడు. అతనితో ఆత్మాహుతి దాడి చేయించాలని ఉమర్ యోచించాడు. కానీ, చివరి నిమిషంలో వెనక్కి తగ్గాడు. ఈ ఉగ్రడాక్టర్ల గ్రూపులో ఉమర్ అత్యధికంగా ర్యాడికలైజ్ అయిన వ్యక్తి. ఢిల్లీలోని రద్దీ ప్రదేశాల్లో లేదా.. ఏదైన కీలక ప్రార్థనా మందిరం వద్దగానీ అత్యంత శక్తిమంతమైన కారుబాంబును పేల్చాలని కుట్రపన్నినట్లు దర్యాప్తు బృందాలు గుర్తించాయి. శ్రీనగర్ పోలీసులు ఈ సంస్థ గుట్టు రట్టు చేయడంతో.. ఉమర్ ఒక్కసారి తీవ్ర ఆందోళనలకు గురయ్యాడు. దీంతో ఢిల్లీలో పేలుడుకు పాల్పడి ఆత్మహత్య చేసుకొన్నాడు. ఇతడు 2016, 2018లో ఉగ్ర సంస్థల్లో చేరేందుకు విఫల యత్నం చేసినట్లు సమాచారం.

## చదివింది బీఏ..చేసేవి శస్త్ర చికిత్సలు..!



ఓ నకిలీ వైద్యుడి నిర్వాకం వల్ల గర్భిణి మృతిచెందిన ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లో చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబేద్కర్ నగర్‌లోని బస్కారి ప్రాంతంలో యోగేష్ వర్మ అనే సర్జన్ కొన్నేళ్లుగా క్లినిక్‌ను నడుపుతున్నారు. స్థానికంగా ఉండే ఓ గర్భిణి ఫిబ్రవరి 5న ప్రసవం కోసం ఆసుపత్రిలో చేరింది. సిజేరియన్ సెక్షన్ ఆపరేషన్ అనంతరం తీవ్ర రక్తస్రావంతో ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటనపై మృతురాలి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటపడింది. వైద్యుడిగా చలామణి అవుతున్న యోగేష్ వర్మకు వైద్య అర్హతలు లేవని దర్యాప్తులో గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. యోగేష్ బీఏ చదివాడని.. వైద్య వృత్తిలో ఎటువంటి అనుభవం లేదని పోలీసులు తెలిపారు. అతడు ఎక్కడా ప్రత్యేక వైద్య శిక్షణ కూడా తీసుకోలేదన్నారు. ఆరోగ్య అధికారుల నుంచి అనుమతి తీసుకోకుండా నకిలీ క్లినిక్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో సిజేరియన్‌తో సహా ఇతర శస్త్రచికిత్సలు సైతం చేస్తున్నారన్నారు. వెంటనే క్లినిక్‌ను సీజ్ చేసి.. యోగేష్‌ను, అతడి సహాయకుడిని అరెస్ట్ చేశామన్నారు.

## తారిఖ్ రెహమాన్ ప్రమాణం.. ప్రధాని మోదీకి బంగ్లాదేశ్ ఆహ్వానం!



బంగ్లాదేశ్ ఎన్నికల్లో విజయం సాధించిన బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ) ఛైర్మన్ తారిఖ్ రెహమాన్ కొత్త ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసేందుకు సిద్ధమయ్యారు. ఫిబ్రవరి 17న ఈ కార్యక్రమం జరగనున్నట్లు తెలుస్తోంది. ఇందులో పాల్గొనాలని భారత ప్రధాని మోదీకి ఆహ్వానం అందినట్లు సమాచారం. ఈ మేరకు అధికార వర్గాలను ఉటంకిస్తూ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని బంగ్లాదేశ్ పార్లమెంటు హౌస్‌లోని సదరన్ ప్లాజాలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలని యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం 13 దేశాలకు ఆహ్వానం పంపింది. ఇందులో చైనా, సౌదీ అరేబియా, పాకిస్థాన్, తుర్కియే, ఖతార్, శ్రీలంక, నేపాల్‌తో పాటు భారత్ ఉన్నట్లు తెలుస్తోంది. భారత్ బంగ్లాదేశ్‌ల మధ్య సంబంధాలు ఇటీవల దెబ్బతిన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఈ ఆహ్వానం అందడం కీలక పరిణామంగా కన్పిస్తోంది. అయితే, ప్రధాని మోదీ ఈ కార్యక్రమానికి హాజరవుతారా లేదా అనే దానిపై స్పష్టత లేదు. బంగ్లాదేశ్ ఆహ్వానాన్ని భారత్ ఇంకా ధ్రువీకరించలేదు. బంగ్లాదేశ్‌లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో బీఎన్‌పీ ఘన విజయం సాధించింది. ప్రధాని మోదీ రెహమాన్‌కు ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. దీనిపై మోదీకి బీఎన్‌పీ ధన్యవాదాలు తెలిపింది. ఎన్నికల్లో గెలుపు తర్వాత శనివారం రెహమాన్ దేశ ప్రజలను ఉద్దేశించి తొలిసారి మాట్లాడారు. ఈ సందర్భంగా భారత్‌తో నిర్మాణాత్మక అనుబంధాన్ని కొనసాగిస్తామన్నారు. బంగ్లాదేశ్ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు.

## సుదీర్ఘ న్యాయ పోరాటం చేయలేక..
## నేరం మీదేసుకొన్నాడు: నిఖిల్ గుప్తా కుటుంబీకులు



ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ పన్నూ హత్యకు కుట్ర పన్నిన కేసులో.. న్యాయపోరాటం చేయడంలో నిఖిల్ గుప్తా అలసిపోయాడని అతడి కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అందుకే అతడు గురుపత్వంత్ పన్నూ హత్యకు కుట్రపన్నినట్లు అంగీకరిస్తూ నేరాన్ని మీదేసుకొన్నట్లు అతడి కుటుంబీకులు ఓ ఆంగ్ల మీడియాకు వెల్లడించారు. మరోవైపు నిఖిల్ నిర్ణయం లాయర్ల ద్వారానే తమకు తెలిసినట్లు అతడి కుటుంబీకులు వెల్లడించారు. "ఈ కేసుకు సంబంధించి నిఖిల్ కుటుంబం దీర్ఘకాలంగా పోరాడుతోంది. ఇది ఇంకా చాలా కాలం కొనసాగుతుందని నిఖిల్ అర్థం చేసుకొని.. నేరాన్ని అంగీకరించి.. దీనికి ఓ ముగింపు తీసుకురావాలనుకున్నాడు. అతడు అప్రూవర్‌గా మారలేదు.. మొత్తం నేరం తనపై వేసుకొన్నాడని అతడి కుటుంబ సభ్యులు చెప్పారు" అని నిఖిల్ సన్నిహితులు పేర్కొన్నారు. అయితే నిఖిల్ నేరాంగీకారంపై అతడి తల్లి, భార్య షాక్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా ఈ నేరానికి అత్యధికంగా 40 ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంది. గురువారం గుప్తా యూఎస్ మెజిస్ట్రేట్ జడ్జి సారా నెట్‌బర్న్ ముందు హాజరయ్యారు. ఈ క్రమంలో కిరాయి తీసుకొని పన్నూని హత్య చేయడానికి ఒప్పుకోవడం, దానికి ప్లాన్ చేయడంతో పాటు మనీలాండరింగ్ కుట్ర వంటి మూడు నేరారోపణలను అతడు అంగీకరించాడు. ఈ కేసుపై మే 29న న్యాయస్థానం శిక్ష విధించనుంది.

## చమురు కొనుగోళ్లు.. రాజకీయ ఒత్తిళ్లు పనిచేయవు: జైశంకర్

వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేసిందంటూ అమెరికా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో చమురు దిగుమతులపై భారత విదేశాంగ మంత్రి జై శంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంధన కొనుగోళ్ల విషయంలో రాజకీయ ఒత్తిళ్లు పనిచేయవన్నారు. అది జాతీయ ప్రయోజనాలపై ఆధారపడి ఉంటుందని.. భారత్ ఈ విషయంలో స్వతంత్రంగా వ్యవహరిస్తుందన్నారు. జర్మనీలోని మ్యూనిచ్ భద్రతా సమావేశంలో జై శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓ ప్రశ్నకు బదులిస్తూ.. భారత్ తన వ్యూహాత్మక ప్రయోజనాలకు కట్టుబడి ఉంటుందన్నారు. 'ఇంధన సమస్యల విషయానికొస్తే.. ప్రస్తుతం మార్కెట్ సంక్లిష్టంగా ఉంది. భారత్‌లోని చమురు కంపెనీలు యూరప్‌తో సహా ప్రపంచంలోని ఇతర ప్రాంతాలను కూడా పరిశీలిస్తాయి. ఖర్చులు, నష్టాలు, లభ్యతను చూసి.. వారి ప్రయోజనాలకు తగ్గట్లు నిర్ణయాలు తీసుకుంటారు' అని అన్నారు. అమెరికాతో ఇటీవల ఇండియాకు మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. దీంతో భారత దిగుమతులపై సుంకాలను అగ్రరాజ్యం 18 శాతానికి తగ్గించింది. ఈ క్రమంలో రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేసేందుకు ఆ దేశం కట్టుబడి ఉందంటూ అమెరికా ప్రకటించింది. ఈ విషయంలో భారత్ మాత్రం స్పందించలేదు. తాజాగా జై శంకర్ వ్యాఖ్యలతో యూఎస్‌కు సమాధానమిచ్చినట్లైంది.



## గ్రహాంతర జీవులు ఉన్నాయి.. కానీ: ఒబామా



అంతుచిక్కని రహస్యంగా మారిన గ్రహాంతరవాసులపై ఎన్నో ఊహాగానాలు వస్తుంటాయి. గ్రహాంతరవాసులు, గుర్తుతెలియని ఎగిరే వస్తువుల వంటి వాటితో అమెరికాలోని 'ఏరియా 51'కు బలమైన సంబంధాలున్నాయన్న ప్రచారమూ ఉంది. దీనిపై అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఓ పాడ్‌కాస్ట్‌లో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఏదో ఒక గ్రహంపై గ్రహాంతర వాసులు ఉండే విషయాన్ని తాను బలంగా నమ్ముతున్నానని అన్నారు. కానీ.. ఏలియన్స్‌ను ఏరియా 51లో అమెరికా నిర్బంధించిందనే ఊహాగానాల్లో నిజం లేదని స్పష్టం చేశారు. దీనిని నిరూపించడానికి ఎటువంటి ఆధారాలు కూడా లేవన్నారు. దశాబ్దం క్రితం యూఎస్ ఎయిర్ ఫోర్స్ రీపర్ డ్రోన్లు సేకరించిన రాడార్ రికార్డింగ్‌లలో మధ్యప్రాచ్యంలోని కొన్ని ప్రాంతాలపై అసాధారణ జీవుల ఉనికి కనిపించిందని పలు నివేదికలు సూచిస్తుండడంపై ఒబామా స్పందించారు. గ్రహాంతర వాసుల ఉనికికి సంబంధించిన పలు రికార్డులు అమెరికా ప్రభుత్వం దగ్గర ఉన్నట్లు తాను అధికారంలో ఉన్న సమయంలో కూడా సమాచారం లేదన్నారు.

## అందుకు ఓకే అయితే.. న్యూక్లియర్ డీల్‌కు రెడీ: ఇరాన్



అమెరికాతో చర్చలు కొనసాగుతున్న వేళ.. అణు ఒప్పందంపై రాజీకి వచ్చేందుకు ఇరాన్ సిద్ధమైంది. యూఎస్‌తో న్యూక్లియర్ డీల్ కుదుర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. అయితే, తమపై ఉన్న ఆంక్షలను ఎత్తివేయాలని షరతు పెట్టింది. ఈ మేరకు ఇరాన్ మంత్రి మాజిద్ తఖ్తా ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. మాజిద్ మాట్లాడుతూ.. ఒప్పందం కుదుర్చుకోవడానికి బంతి అమెరికా కోర్టులోనే ఉందని వ్యాఖ్యానించారు. 'ఆంక్షలను ఎత్తివేయడం గురించి మాట్లాడేందుకు వారు సిద్ధమైతే.. మా అణు కార్యక్రమాలకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం' అని అన్నారు. అయితే, అన్ని ఆంక్షలు ఎత్తివేయాలా? లేదా పాక్షిక ఉపశమనం కోరుకుంటున్నారా? అనే విషయాన్ని ఆయన స్పష్టం చేయలేదు. ప్రస్తుతం జరుగుతున్న చర్చల్లో ఇరాన్ ఒప్పందానికి రాకపోతే.. సైనిక చర్యలకు దిగుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో టెహ్రాన్ ప్రకటన కీలకంగా మారింది. అణు కార్యక్రమానికి సంబంధించి ఇరుదేశాల మధ్య ఒమన్ వేదికగా పరోక్ష చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. ఇవి సానుకూలంగా జరిగాయని మాజిద్ పేర్కొన్నారు. త్వరలోనే రెండో రౌండ్ చర్చలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

# ‘రొమాంటిక్ మోడల్’కు గుడ్ బై చెప్పిన ఓపెన్ ఏఐ...

**యూజర్ల తీవ్ర విచారం**

**చాట్‌జీపీటీ యాప్ నుంచి జీపీటీ-4నీ మోడల్ తొలగింపు**

**దాన్ని ఓ టూల్‌గా కాకుండా రొమాంటిక్ తోడుగా భావిస్తున్న యూజర్లు**

**ఓపెన్‌ఏఐ నిర్ణయంపై ప్రపంచవ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసనలు**

**జీపీటీ-4నీను కొనసాగించాలని 20,000 మందికి పైగా సంతకాలతో పిటిషన్**

**చైనాలోనూ శామ్ ఆల్ట్‌మన్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఫ్యాన్స్**




**న్యూఢిల్లీ:** ప్రముఖ ఏఐ సంస్థ ఓపెన్‌ఏఐ తీసుకున్న ఓ నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా పలువురు యూజర్లను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. చాట్‌జీపీటీ యాప్‌లో అత్యంత ప్రాచుర్యం పొందిన జీపీటీ-4నీ ఏఐ మోడల్‌కు యాక్సెస్‌ను కంపెనీ పూర్తిగా తొలగించింది. దీన్ని కేవలం ఒక టూల్‌గా కాకుండా, తమకు మానసికంగా తోడుండే స్నేహితుడిగా భావించే యూజర్లు ఈ పరిణామంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇతర ఏఐ మోడళ్ల కంటే జీపీటీ-4నీ వెర్షన్ మరింత ఆప్యాయంగా, అర్థం చేసుకునే తత్వంతో, కాస్తంత రొమాంటిక్ గానూ ఉంటుందని యూజర్లు నమ్ముతారు. వాస్తవానికి, గత ఏడాది 2025 ఆగస్టులోనే దీన్ని తొలగించాలని ఓపెన్‌ఏఐ ప్రయత్నించగా, తీవ్ర వ్యతిరేకత రావడంతో పెయిడ్ యూజర్లకు మళ్లీ అందుబాటులోకి తెచ్చింది. అయితే, ఫిబ్రవరి 13న యాప్ యూజర్ల కోసం ఈ మోడల్‌ను శాశ్వతంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. సోమవారం నుంచి డెవలపర్‌లకు కూడా ఏపీఐ యాక్సెస్‌ను నిలిపివేయనుంది.

ఈ నిర్ణయంపై యూజర్ల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. జీపీటీ-4నీను కొనసాగించాలని కోరుతూ అప్త్రజీనిణవ.నీతీణలో పెట్టిన పిటిషన్‌పై ఇప్పటికే 20,000 మందికి పైగా సంతకాలు చేశారు. సిరాక్యూస్ యూనివర్సిటీ పరిశోధన ప్రకారం, 33 శాతం మందికి పైగా యూజర్లు దీన్ని ఒక టూల్ కంటే ఎక్కువగా భావిస్తుండగా, 22 శాతం మంది దీన్ని ఒక తోడుగా అభివర్ణించారు.

చైనాలో చాట్‌జీపీటీపై నిషేధం ఉన్నప్పటికీ, వీపీఎన్ ద్వారా దీన్ని వాడే యూజర్లు సైతం తీవ్రంగా స్పందిస్తున్నారు. కొందరు తమ సబ్‌స్క్రిప్షన్‌లను రద్దు చేసుకుంటామని హెచ్చరిస్తుండగా, మరికొందరు ఓపెన్‌ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్‌ను నిలదీస్తూ, మైక్రోసాఫ్ట్, సాఫ్ట్‌బ్యాంక్ వంటి ఇన్వెస్టర్లకు ఈ-మెయిల్స్ పంపుతున్నారు. డెవలపర్లు బేస్ మోడల్‌ను యాక్సెస్ చేయవచ్చని ఓపెన్‌ఏఐ చెబుతున్నా, అది తమకు ఇష్టమైన టెక్స్ట్-ఓన్లీ వెర్షన్ అంత బాగా లేదని ఫ్యాన్స్ వాదిస్తున్నారు. తమ ఆవేదనను కంపెనీ పట్టించుకోవడం లేదని వారు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

## ఇక ఆధార్ కార్డుకు కొత్త రూపు!

**ఆధార్ కార్డుల రూపురేఖలు మార్చేందుకు యూఐడీఏఐ సన్నాహాలు**

**దుర్వినియోగాన్ని అరికట్టడమే లక్ష్యంగా కొత్త డిజైన్ ప్రతిపాదన**

**కార్డుపై కేవలం ఫోటో, క్యూఆర్ కోడ్ మాత్రమే ముద్రణ**

**ఆధార్ నంబర్, పేరు, చిరునామా వంటి వివరాలు తొలగింపు**

**ధృవీకరణ ప్రక్రియ ఇకపై క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారానే**




**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా కోట్లాది మంది గుర్తింపు కార్డుగా మారిన ఆధార్ కార్డు స్వరూపంలో భారీ మార్పులు రాబోతున్నాయి. ఆధార్ కార్డు ఫోటోకాపీల ద్వారా జరుగుతున్న మోసాలు, వ్యక్తిగత సమాచార దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ఈ కీలక మార్పులను ప్రతిపాదించింది. ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే, భౌతిక ఆధార్ కార్డుపై ఇకపై వ్యక్తిగత వివరాలు కనిపించవు.

ప్రస్తుతం మనం బ్యాంకు ఖాతా తెరిచేందుకు, సిమ్ కార్డు కొనుగోలు చేసేందుకు, ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఆధార్ కార్డు ఫోటోకాపీలను ఇస్తున్నాం. ఈ కార్డులపై 12 అంకెల ఆధార్ నంబర్‌తో పాటు పేరు, పుట్టిన తేదీ, చిరునామా వంటి అత్యంత సున్నితమైన సమాచారం ముద్రించి ఉంటోంది. ఈ ఫోటోకాపీలు నేరగాళ్ల చేతికి చిక్కితే గుర్తింపు చోరీ (ఐడెంటిటీ థెఫ్ట్), ఆర్థిక మోసాలు జరిగే ప్రమాదం ఎక్కువగా ఉందని యూఐడీఏఐ గుర్తించింది. ఈ సమస్యను అధిగమించేందుకు, కొత్తగా జారీ చేయబోయే ఆధార్ కార్డులపై కేవలం కార్డుదారుడి ఫోటో, ఒక ప్రత్యేకమైన ఎన్‌క్రిప్టెడ్ క్యూఆర్ కోడ్ మాత్రమే ప్రదర్శించాలని యూఐడీఏఐ యోచిస్తోంది. ఆధార్ నంబర్, చిరునామా వంటి వివరాలన్నీ ఈ క్యూఆర్ కోడ్‌లో భద్రంగా నిక్షిప్తమై ఉంటాయి. గుర్తింపు ధృవీకరణ అవసరమైనప్పుడు, సంబంధిత సంస్థలు తమ వద్ద ఉన్న అధీకృత యాప్‌ల ద్వారా ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వివరాలను సరిచూసుకుంటాయి. దీనివల్ల కేవైసీ ప్రక్రియ వేగవంతం అవ్వడమే కాకుండా, వ్యక్తిగత సమాచారానికి పూర్తి భద్రత లభిస్తుంది.

గత ఏడాది నుంచే ఈ మార్పులపై కసరత్తు జరుగుతోందని, త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడవచ్చని తెలుస్తోంది. ఆధార్ ఫోటోకాపీల ద్వారా జరిగే దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కొత్త నిబంధనలు తీసుకొస్తున్నామని యూఐడీఏఐ సీఈవో భువనేశ్ కుమార్ ఇటీవలే ఒక సమావేశంలో స్పష్టం చేశారు. ఇటీవల విడుదల చేసిన కొత్త ఆధార్ మొబైల్ యాప్‌లో కూడా లాగిన్ అయిన తర్వాత కేవలం ఫోటో, క్యూఆర్ కోడ్ మాత్రమే కనిపించేలా మార్పులు చేసిన విషయం తెలిసిందే. ఈ ప్రతిపాదన అమలైతే ఆధార్ గోప్యత మరింత పటిష్ఠం అవుతుందని, మోసాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడుతుందని సాంకేతిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ఎలక్ట్రిక్ టూవీలర్ల మార్కెట్‌లో టీవీఎస్, బజాజ్, హీరో హవా

**న్యూఢిల్లీ:** విద్యుత్ ద్విచక్ర వాహనాల విషయంలో నిన్న మొన్నటి వరకు ఆధిపత్యం చెలాయించిన స్టార్టప్ కంపెనీలు చతికిలపడ్డాయి. తన మార్కెట్ వాటాను మెల్లగా టీవీఎస్, బజాజ్, హీరో వంటి సంప్రదాయ ద్విచక్ర వాహనాలకు అప్పగించేశాయి. ఈ ఏడాది జనవరి విక్రయాలే ఇందుకు నిదర్శనం. 2023లో కేవలం 34 శాతంగా ఉన్న ఈ మూడు కంపెనీల మార్కెట్ వాటా తాజాగా 60 శాతానికి చేరినట్లు జాటో డైనమిక్స్ రీసెర్చ్ సంస్థ వెల్లడించింది.

సంప్రదాయ ద్విచక్ర వాహనాల తయారీలో దిగ్గజ కంపెనీలుగా పేరొందిన హీరో, బజాజ్, టీవీఎస్.. ఎలక్ట్రిక్ వాహనాల విషయంలో మాత్రం కాస్త ఆలస్యంగా మార్కెట్‌లోకి ఎంట్రీ ఇచ్చాయి. ఆ సమయంలో స్టార్టప్ కంపెనీలు సత్తా చాటాయి. ఓలా ఎలక్ట్రిక్ సంస్థ ఓ దశలో మూడోవంతు మార్కెట్ వాటాను ఆక్రమించింది. ఇతర స్టార్టప్ కంపెనీలూ విక్రయాల్లో రాణించాయి. దిగ్గజ సంస్థలైన టీవీఎస్, బజాజ్ ఎప్పుడైతే మార్కెట్‌లోకి రావడం ప్రారంభమైందో.. వాటి మార్కెట్ వాటా క్రమంగా క్షీణించడం మొదలైంది. హీరో కూడా విడా పేరుతో ఇంకాస్త ఆలస్యంగానే ఎలక్ట్రిక్ వాహన విభాగంలోకి రంగప్రవేశం చేసింది.

మార్కెట్లోకి ఆలస్యంగా వచ్చినప్పటికీ వినియోగదారుల నమ్మకాన్ని చూరగొనడంలో ఈ దిగ్గజ కంపెనీలు ముందువరుసలో నిలిచాయి. దీంతో మార్కెట్ వాటాను పెంచుకోగలిగాయి. ఈ క్రమంలో ఈ ఏడాది జనరి నాటికి టీవీఎస్ సంస్థ 28 శాతం వాటాతో అగ్రస్థానంలో నిలిచింది. బజాజ్ ఆటో 21 శాతం సాధించింది. స్టార్టప్ సంస్థ ఏథర్ 18 శాతంతో మూడో స్థానంలో నిలిచింది. హీరో మోటోకార్ప్ 11 శాతం మార్కెట్ వాటాను సొంతం చేసుకోగలిగంది. ఒకప్పుడు 36 శాతం మార్కెట్ వాటాతో అగ్రస్థానంలో ఉన్న ఓలా కేవలం 6 శాతానికి పరిమితమైంది.

# శివమెత్తిన ఇషాన్..

**భారత బౌలర్ల ధాటికి జడుసుకున్న పాకిస్థాన్..!**




**కొలంబో:** పొట్టి ప్రపంచకప్‌లో తమకు తిరుగులేదని చాటుతూ పాకిస్థాన్‌ను మట్టికరిపించింది భారత్. ప్రేమదాస మైదానంలో ఓపెనర్ ఇషాన్ కిషన్(77) అర్థ శతకంతో శివమెత్తగా.. బౌలింగ్ దళం విజృంభణతో టీమిండియా లీగ్ దశలో హ్యాట్రిక్ కొట్టింది. ఛేదనలో బుమ్రా(2-17), అక్షర్ పటేల్(2-29) కీలక వికెట్లతో పాక్‌ను పడగొట్టారు. పవర్ ప్లేలోనే నలుగురు ఔటవ్వగా.. ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగని పాక్‌ను భారత్ ఎనిమిదోసారి చిత్తు చేసింది. ఇకపై పాక్‌తో గ్రేటెస్ట్ రైవర్లీ అనేది ఉత్తమాటే అని చాటింది.




ప్రపంచకప్ వంటి మెగా టోర్నీలో భారత్ అంటే జడుసుకునే పాకిస్థాన్ మరోసారి మ్యాచ్‌ను అప్పగించేసింది. ఆసియా కప్‌లో టీమిండియా చేతిలో చావుదెబ్బతిన్న పాక్.. పొట్టి కప్‌లోనూ మా వల్ల కాదని చేతులెత్తేసింది. మ్యాచ్‌కు ముందు మేము అత్యుత్తమ జట్టుతోతలపడాలని అనకుంటున్నామని చెప్పిన పాక్ సారథి.. అత్యుత్తమ ఆటను మాత్రం కనబరచడంలో విఫలమయ్యాడు. ఫలితంగా.. ప్రేమదాస స్టేడియంలో భారత్ నిర్దేశించిన భారీ ఛేదనలో దాయది పరిమితమై ఘోర పరాభవం మూటగట్టుకుంది. జట్టు ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. మొదటి ఓవర్లోనే ఓపెనర్ సహిబ్జద ఫర్హాన్(0)ను హార్దిక్ పాండ్యా(1-8) వెనక్కి పంపగా.. జస్ప్రీత్ బుమ్రా(2-17) ఒకే ఓవర్లో ఇద్దరని పెవిలియన్ పంపి దాయాదికి దిమ్మతిరిగే షాకిచ్చాడు. ఐదో ఓవర్లో రెండు ఫోర్లు ఇచ్చిన అక్షర్ పటేల్(2-29) సూపర్ డెలివరీతో బాబర్ ఆజాం(5)ను బౌల్డ్ చేసి పాక్‌ను ఒత్తిడిలో పడేశాడు. అంతే.. 34కే పాక్ నాలుగో వికెట్ కోల్పోయింది.

### ఉస్మాన్ మెరవగా..

పవర్ ప్లేలోనే నాలుగు వికెట్లు పడిన వేళ పాక్ జట్టును ఆదుకునేందుకు ఉస్మాన్ ఖాన్(44) గట్టిగానే ప్రయత్నించాడు. స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కొంటూ బౌండరీలు బాదేస్తున్న అతడిని అక్షర్ బోల్తా కొట్టించగా.. ఇషాన్ రెప్పపాటులో స్టంపింగ్ చేశాడు. ఆ వికెట్‌లో పాక్ ఆశలు ఆవిరయ్యాయి. కాసేపటికే కుల్దీప్ వేసిన లో ఫుల్‌టాస్‌కు షాట్ ఆడిన నవాజ్(4) శివం దూబేకు క్యాచ్ ఇచ్చాడు.. పార్ట్ టైమ్ స్పిన్నర్ తిలక్ ఓవర్లో షాదాబ్ ఖాన్(14) దూబేకే చిక్కడంతో పాక్ ఓటమి ఖాయమైంది. వరుణ్ చక్రవర్తి(2-17) ఒకే ఓవర్లో ఫహీం అష్రఫ్(10), అబ్రార్ అహ్మద్(0)ను ఔట్ చేసి హ్యాట్రిక్‌పై నిలిచాడు. షాహీన్ అఫ్రిది(23 నాటౌట్) కాసేపు పోరాడినా.. ఉస్మాన్ తారీఖ్‌ను బౌల్డ్ చేసిన పాండ్యా పాక్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. 61 పరుగుల తేడాతో గెలుపొందింది టీమిండియా.

## టీ20 వరల్డ్ కప్.. నమీబియాపై విజయంతో లీగ్ దశ ముగించిన అమెరికా

**టీ20 ప్రపంచకప్‌లో నమీబియాపై 31 పరుగులతో అమెరికా విజయం**

**తొలుత బ్యాటింగ్ చేసిన అమెరికా 20 ఓవర్లలో 199 పరుగులు**

**ఛేదనలో 168 పరుగులకే పరిమితమైన నమీబియా**

**నమీబియా తరపున లౌరెన్ స్టీన్‌క్యాంప్ (58) పోరాటం విఫలం**



**చెన్నై:** ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో భాగంగా నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో అమెరికా 31 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో అమెరికా బ్యాటర్లు సంజయ్ కృష్ణమూర్తి, కెప్టెన్ మోనాంక్ పటేల్ అర్థ శతకాలతో చెలరేగడంతో తొలుత భారీ స్కోరు నమోదైంది. అనంతరం లక్ష్య ఛేదనలో నమీబియా తడబడింది.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అమెరికా, నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 199 పరుగుల భారీ స్కోరు చేసింది. కెప్టెన్ మోనాంక్ పటేల్ (30 బంతుల్లో 52) మెరుపు ఆరంభాన్ని అందించగా, చివర్లో సంజయ్ కృష్ణమూర్తి (33 బంతుల్లో 68 నాటౌట్) విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. అతని ఇన్నింగ్స్‌లో 6 సిక్సర్లు, 4 ఫోర్లు ఉన్నాయి. వీరిద్దరి ధాటికి అమెరికా సునాయాసంగా భారీ స్కోరు చేయగలిగింది. నమీబియా బౌలర్లలో విల్లెమ్ మైబర్గ్, గెరార్డ్ ఎరాస్మస్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.

200 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన నమీబియా, 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 168 పరుగులకే పరిమితమైంది. ఓపెనర్ లౌరెన్ స్టీన్‌క్యాంప్ (39 బంతుల్లో 58) ఒక్కడే అర్థ శతకంతో పోరాడాడు. మిగతా బ్యాటర్ల నుంచి ఆశించిన సహకారం లభించలేదు. అమెరికా బౌలర్లలో షాడ్లీ వాన్ షాల్క్‌విక్ రెండు వికెట్లతో రాణించగా, సౌరభ్ నేత్రావల్కర్, అలీ ఖాన్, శుభమ్ రంజానె తలో వికెట్ తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.

## నేపాల్‌పై గెలిచి... దర్జాగా సూపర్-8లోకి ప్రవేశించిన వెస్టిండీస్

**టీ20 ప్రపంచకప్‌లో నేపాల్‌పై వెస్టిండీస్ 9 వికెట్ల తేడాతో భారీ విజయం**

**ఈ విజయంతో గ్రూప్-సి నుంచి సూపర్ 8 దశకు అర్హత సాధించిన విండీస్**

**అజేయ హాఫ్ సెంచరీతో రాణించిన షాయ్ హోప్, హెట్‌మెయర్ మెరుపు ఇన్నింగ్స్**

**బౌలింగ్‌లో 4 వికెట్లతో నేపాల్‌ను దెబ్బతీసిన జాసన్ హోల్డర్**

**ఈ ఓటమితో టోర్నీ నుంచి అధికారికంగా నిష్క్రమించిన నేపాల్**



**ముంబై:** టీ20 ప్రపంచకప్‌లో వెస్టిండీస్ జట్టు అద్భుత ప్రదర్శనతో సూపర్ 8 దశకు అర్హత సాధించింది. ఆదివారం ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగిన గ్రూప్-సి మ్యాచ్‌లో నేపాల్‌పై 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బౌలింగ్‌లో, ఆ తర్వాత బ్యాటింగ్‌లో సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించిన కరీబియన్ జట్టు, ఈ టోర్నీలో నేపాల్ ప్రస్థానానికి ముగింపు పలికింది.

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న వెస్టిండీస్‌కు కెప్టెన్ నిర్ణయం సరైనదని బౌలర్లు నిరూపించారు. జాసన్ హోల్డర్ (4/27) అద్భుత బౌలింగ్‌తో నేపాల్ బ్యాటింగ్ ఆర్డర్‌ను దెబ్బతీశాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా, దీపేంద్ర సింగ్ ఐరీ (47 బంతుల్లో 58) ఒంటరి పోరాటం చేసి హాఫ్ సెంచరీ సాధించాడు. చివర్లో సోంపాల్ కమీ (15 బంతుల్లో 26) వేగంగా ఆడటంతో నేపాల్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 133 పరుగులు చేయగలిగింది.

అనంతరం 134 పరుగుల సులభ లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్‌కు ఓపెనర్ బ్రాండన్ కింగ్ (22) మంచి ఆరంభాన్ని ఇచ్చాడు. అతను ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన షిమ్రాన్ హెట్‌మెయర్ (32 బంతుల్లో 46 నాటౌట్), మరో ఓపెనర్, కెప్టెన్ షాయ్ హోప్ (44 బంతుల్లో 61 నాటౌట్)తో కలిసి విధ్వంసం సృష్టించాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు అజేయంగా 91 పరుగులు జోడించడంతో విండీస్ కేవలం 15.2 ఓవర్లలోనే ఒక వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

# అమ్మాయిల బోణీ.. తొలి టీ20లో ఆసీస్‌పై గెలుపు

**మెరిసిన హైదరాబాదీ పేసర్ అరుంధతి**



**సిడ్నీ:** ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) తర్వాత భారత మహిళల జట్టు ఆడిన తొలి మ్యాచ్‌లోనే సత్తాచాటింది. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న హర్మన్‌ప్రీత్ కౌర్ సేన.. కంగారూలతో సిడ్నీలో వర్షం అంతరాయం కల్గించిన తొలి మ్యాచ్‌లో ప్రత్యర్థిని 21 పరుగుల (డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో) తేడాతో ఓడించి మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యం సాధించింది. హైదరాబాదీ పేసర్ అరుంధతి రెడ్డి (4/22) కెరీర్ బెస్ట్ ప్రదర్శనకు తోడు రేణుకా సింగ్ ఠాకూర్ (2/14) పవర్ ప్లేలో కట్టుదిట్టమైన బౌలింగ్‌తో మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 18 ఓవర్లలో 133 పరుగులకే కుప్పకూలింది.

జార్జియా వర్హైమ్ (19 బంతుల్లో 30, 4 ఫోర్లు) టాప్ స్కోరర్. తెలుగమ్మాయి శ్రీచరణి (2/14) రెండు వికెట్లు తీసింది. స్వల్ప ఛేదనలో బ్యాటింగ్‌కు వచ్చిన భారత్.. 5 ఓవర్లలోనే 50 రన్స్ దంచేసింది. షెఫాలీ వర్మ (11 బంతుల్లో 21, 1 ఫోర్, 2 సిక్సులు) ధాటిగా ఆడింది. వర్షం వచ్చే సమయానికి లక్ష్యానికంటే 21 రన్స్ ఎక్కువగా ఉండటంతో భారత్ విజేతగా నిలిచింది. ఆస్ట్రేలియాలో ఆస్ట్రేలియాను ఓడించడం (టీ20ల్లో) భారత్‌కు ఆరేండ్ల తర్వాత ఇదే ప్రథమం.

MOVIE TIME

## ప్రేమలు హీరో 'మాలీవుడ్ టైమ్స్'..

### రిలీజ్ డేట్ ఖరారు చేసిన మేకర్స్





**టాకీస్:** 'ప్రేమలు', 'లోక' సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన మలయాళ యువ హీరో నస్లేన్ గఫూర్ నటిస్తున్న తాజా చిత్రం 'మాలీవుడ్ టైమ్స్' . 'ముకుందన్ ఉన్ని అసోసియేట్స్' వంటి వైవిధ్యమైన సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న అభినవ్ సుందర్ నాయక్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా.. ఇందులో నస్లేన్ 'వినీత్ మాధవన్' అనే పాత్రలో నటించబోతున్నాడు. ఈ పాత్ర ఆస్కార్ అవార్డును గెలవాలని కలలు కనే ఒక ఔత్సాహిక ఫిల్మ్ మేకర్ పాత్ర అని తెలుస్తుంది. అయితే తాజాగా ఈ సినిమా విడుదల తేదీని చిత్రబృందం ప్రకటించింది. ఈ సినిమాను సమ్మర్ కానుకగా మే 14న విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. జేక్స్ బిజోయ్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు.

## 'రాయుడి గారి తాలుకా' ట్రైలర్ విడుదల



**టాకీస్:** శ్రీనివాస్ ఉలిశెట్టి, సత్య ఈషా జంటగా తెరకెక్కుతున్న కుటుంబ కథా చిత్రం 'రాయుడి గారి తాలుకా' ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. ఉలిశెట్టి మూవీస్ బ్యానర్‌పై కొర్రపాటి నవీన్ శ్రీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని నిత్యశ్రీ, పునర్వికా వేద శ్రీ, నవీన్ శ్రీ, పీజే దేవి, కరణం పేరినాయుడు నిర్మిస్తున్నారు. కుటుంబ భావోద్వేగాలు, గ్రామీణ నేపథ్యం కలగలిపిన కథతో ఈ సినిమా సిద్ధమవుతోంది. ఈ చిత్రంలో సుమన్, ఆర్.కే. నాయుడు, సలార్ పూజ, కరణం శ్రీహరి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో వేగంగా పనులు జరుపుకుంటోంది. మ్యూజిక్, ఎడిటింగ్, డబ్బింగ్ వంటి కార్యక్రమాలు పూర్తయ్యే దశకు చేరుకున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది.

తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను 'బంగార్రాజు' ఫేమ్ దర్శకుడు కళ్యాణ్ కృష్ణ చేతుల మీదుగా విడుదల చేశారు. ట్రైలర్‌లో కుటుంబ బంధాలు, భావోద్వేగాలు, గ్రామీణ జీవనశైలి ప్రధానంగా కనిపించడంతో ప్రేక్షకుల్లో సినిమాపై ఆసక్తి పెరిగింది. ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో కళ్యాణ్ కృష్ణ మాట్లాడుతూ? "ట్రైలర్ చాలా బాగుంది. ఈ సినిమా గురించి ఇప్పటికే చాలా మంది ద్వారా విన్నాను. ఇటీవల కాలంలో ఇలాంటి స్వచ్ఛమైన కుటుంబ కథలు అరుదుగా వస్తున్నాయి. టీమ్ అందరికీ నా బెస్ట్ విషెస్" అని అభినందించారు.




## కుర్రాళ్లను కవ్విస్తున్న అనన్య నాగళ్ల..

**టాకీస్:** తెలుగు అమ్మాయిలకు ప్రస్తుతం సినిమా ఇండస్ట్రీలో మంచి అవకాశాలు వస్తున్నాయి. తెలుగు అమ్మాయిలో ఇప్పుడు చాలా మంది హీరోయిన్స్ గా రాణిస్తున్నారు. వారిలో అనన్య నాగళ్ల ఒకరు. మల్లేశం సినిమాతో ప్రేక్షకులను పలకరించింది. తొలి సినిమాతోనే మెప్పించింది. మల్లేశం సినిమా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. తన నటనతో ఆకట్టుకుంది అనన్య నాగళ్ల. తెలంగాణలోని ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన అనన్య హైదరాబాద్ లో నే బీటెక్ పూర్తి చేసింది. ఆ తర్వాత ఇన్ఫోసిస్ లో సాఫ్ట్ వేర్ ఉద్యోగంలో కూడా చేరింది. అయితే జాబ్ చేస్తూనే షార్ట్ ఫిల్మ్స్ లో నటించింది. షాదీ అనే షార్ట్ ఫిల్మ్ లో నటించినందుకు ఆమెకు ఉత్తమ నటిగా సైమా అవార్డ్ అందుకుంది. ఆ తర్వాత ప్రియదర్శితో కలిసి మల్లేశం అనే సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. పవన్ కల్యాణ్ వకీల్ సాబ్ తో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత మ్యాస్ట్రో, ఊర్వశివో రాక్షసివో, శాకుంతం, మళ్లీపెళ్లి, పొట్టేల్, తంత్ర తదితర సినిమాలతో క్రేజీ హీరోయిన్ గా మారిపోయింది. కానీ హిట్స్ మాత్రం సొంతం చేసుకోలేకపోతుంది. 12 సినిమాలు చేసిన ఈ అమ్మడు కేవలం 2 హిట్స్ మాత్రమే అందుకుంది. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్నపటికీ సక్సెస్ మాత్రం అందుకోలేకపోయింది ఈ అందాల భామ. దాంతో ఈ చిన్నది సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా ఫోటోలు షేర్ చేస్తూ మెప్పిస్తుంది ఈ అమ్మడు. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఫోటోలు మెప్పిస్తున్నాయి.

## అల్లు వారింట పెళ్లి సందడి మొదలు

### తొలికార్డ్ చిరంజీవికి అందించిన మెగా ఫ్యామిలీ



**టాకీస్:** అల్లు కుటుంబంలో పెళ్లి వేడుకల హడావిడి మొదలైంది. యువ నటుడు అల్లు శిరీష్ తన ప్రేయసి నయనికతో త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నాడు. గత అక్టోబర్‌లో ఈ జంట నిశ్చితార్థం చేసుకున్న సంగతి తెలిసిందే. కొద్ది రోజుల క్రితం దుబాయ్‌లో ప్రీ?వెడ్డింగ్ వేడుకలు నిర్వహించుకోవడంతో వారి పెళ్లి వార్తలు మరింత హైలైట్ అయ్యాయి. ఇప్పుడు అధికారికంగా పెళ్లి పనులు ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఇటీవల పసుపు కార్యక్రమంతో శుభారంభం చేసినట్లు అల్లు శిరీష్ తన సోషల్ మీడియా ద్వారా వెల్లడించాడు. కుటుంబ సభ్యుల సమక్షంలో సాంప్రదాయ పద్ధతుల్లో కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. తాజాగా పెళ్లి పత్రికల పంపిణీ కార్యక్రమం కూడా ప్రారంభమైంది. తెలుగు సంప్రదాయం ప్రకారం మొదటి పెళ్లి పత్రికను కుటుంబ పెద్దలకు అందించడం ఆనవాయితీ. అదే విధంగా అల్లు శిరీష్ తన తల్లిదండ్రులతో కలిసి మెగాస్టార్ చిరంజీవి, ఆయన భార్య సురేఖ కొణిదెల దంపతులకు తొలి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా తీసిన ఫోటోను శిరీష్ సోషల్ మీడియాలో షేర్ చేస్తూ "మన తెలుగు సాంప్రదాయం ప్రకారం మొదటి పెళ్లి పత్రికను మా మామయ్య, అత్తయ్యలకు అందించాం" అని పేర్కొన్నారు. ఈ ఫోటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వేడుకలో నిర్మాత అల్లు అరవింద్, ఆయన సతీమణి నిర్మలతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. పెళ్లి ఏర్పాట్లు వేగంగా జరుగుతున్న నేపథ్యంలో అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. సినీ వర్గాల్లో కూడా ఈ వివాహం గురించి చర్చ కొనసాగుతోంది.

సమాచారం ప్రకారం అల్లు శిరీష్?నయనికల వివాహం మార్చి 6న హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించనున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, సినీ ప్రముఖుల సమక్షంలో ఈ వేడుక జరగనుందని తెలుస్తోంది. మొత్తానికి అల్లు ఇంట పెళ్లి సందడి మొదలై, అభిమానుల్లోనూ ఉత్సాహాన్ని నింపుతోంది.

## రవితేజ 'ఇరుముడి'లో కావేరిగా ప్రియా భవానీ శంకర్..

### ఆకట్టుకుంటున్న ఫస్ట్ లుక్!

**టాకీస్:** మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఇరుముడి'. ఈ చిత్రం నుంచి కథానాయికను పరిచయం చేశారు మేకర్స్. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రంలో హీరోయిన్‌గా ప్రియా భవానీ శంకర్ నటిస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. ఇందులో ఆమె 'కావేరి' అనే పాత్రలో నటిస్తోంది. విడుదలైన పోస్టర్‌లో ప్రియా భవానీ శంకర్ ఎంతో సంప్రదాయబద్ధంగా ఉండగా.. రవితేజ ఆమెను ముద్దాడుతున్నట్లు కనిపిస్తుంది. ఈ సినిమాలో ఆమె రవితేజకు భార్యగా, ఒక బాధ్యతాయుతమైన తల్లిగా ఎంతో హుందాతనమైన పాత్రను పోషిస్తున్నట్లు తెలుస్తోంది.


రవితేజ కెరీర్‌లో 77వ సినిమాగా వస్తున్న ఈ చిత్రంలో ఆయన ఒక అయ్యప్ప భక్తుడిగా కనిపించబోతున్నారు. ఇప్పటికే విడుదలైన రవితేజ ఫస్ట్ లుక్ సినిమాపై భారీ అంచనాలను పెంచగా, ఇప్పుడు హీరోయిన్ లుక్ కూడా తోడవడంతో సినిమాపై పాజిటివ్ వైబ్స్ క్రియేట్ అయ్యాయి. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో సాయి కుమార్, బేబీ నక్షత్ర, అజయ్ ఘోష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ముఖ్యంగా తండ్రి-కూతుళ్ల మధ్య ఉండే ఎమోషనల్ బాండింగ్ చుట్టూ ఈ కథ సాగనుందని సమాచారం. త్వరలోనే ఈ




సినిమాకు సంబంధించిన టీజర్ మరియు విడుదల తేదీని ప్రకటించేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

## భారీ అంచనాల మధ్య విడుదలకి సిద్ధంగా ఉన్న 'పెద్ది' ..

**టాకీస్:** మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ పెద్దిపై ప్రేక్షకుల్లో రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. 'ఉప్పెన'తో దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న బుచ్చిబాబు సానా ఈ చిత్రాన్ని రా అండ్ రస్టిక్ బ్యాక్‌డ్రాప్‌లో మాస్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు. గ్రామీణ వాతావరణం, భావోద్వేగాలు, యాక్షన్ మేళవింపుతో వస్తున్న ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ హీరోయిన్ జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, సీనియర్ నటుడు జగపతి బాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. విభిన్న పాత్రల సమాహారంగా రూపొందుతున్న ఈ సినిమా కాస్టింగ్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ ప్రేక్షకుల్లో మంచి రెస్పాన్స్ దక్కించుకోగా, తాజాగా ఫిబ్రవరి 15న దర్శకుడు బుచ్చిబాబు సనా జన్మదినం సందర్భంగా మేకర్స్ ఓ స్పెషల్ వీడియోను విడుదల చేశారు. ఆ వీడియోలోని విజువల్స్, ఫ్రేమింగ్, యాక్షన్ షాట్స్ నెక్స్ట్ లెవెల్‌లో ఉన్నాయంటూ అభిమానులు సోషల్ మీడియాలో ప్రశంసలు కురిపిస్తున్నారు. ముఖ్యంగా రామ్ చరణ్ లుక్ మాస్ అండ్ ఇంటెన్స్‌గా ఉండటంతో సినిమాపై హైప్ మరింత పెరిగింది. ప్రతి సన్నివేశం కోసం దర్శకుడు పడుతున్న శ్రమ స్పష్టంగా కనిపిస్తోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ రోజు సినిమా సెకండ్ సాంగ్ విడుదల అవుతుందని అంతా అనుకున్నారు. కాని స్పెషల్ వీడియోతో సరిపెట్టారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.